జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

https://prajapalana.com/epaper.php



ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523



సంపుటి 7 సంచిక 93 | హైదరాబాద్, జూన్ 17 శనివారం 2023 | 8 పేజీలు | వెల : 5.00


# తొలకరి జల్లు నేలను తాకేదెప్పుడు?

## ఆగిపోయిన నైరుతి రుతుపవనాల విస్తరణ


# రైతుల కళ్లలో ఆనందం ఎప్పుడు?



ఏటా జూన్ మాసం వచ్చిందంటే చాలు.. మొదటి వారం నుంచీ వాతావరణం మారిపోతుంది. రుతుపవనాల రాకతో చల్లబడటమే కాకుండా.. తొలకరి పలకరింపుతో రైతులు ఉత్సాహంగా ఉండేవాళ్లు. కానీ ఈ ఏడాది భిన్నపరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎండలు మండిపోతున్నాయ్.. ఇప్పటికీ చినుకు జాడ లేదు. ఈ నెల 11నే ఏపీ సరిహద్దును రుతుపవనాలు తాకినప్పటికీ.. ఇంకా తెలుగు రాష్ట్రాల్లో విస్తరించలేదు. ఏపీలోనే స్తంభించిపోయాయి. ఈనెల 19 నాటికిగానీ అవి తెలంగాణకు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్తోంది వాతావరణశాఖ.సాధారణంగా జూన్ మొదటివారం ముగిసే నాటికి ఉష్ణోగ్రతలు తగ్గాలి. రుతుపవనాలు జూన్ 10న తెలంగాణను తాకాలి. అయితే ఈ ఏడాది వాటి రాక ఆలస్యమవడంతో 15వ తేదీలోపు వస్తాయని ఐఎండీ ప్రకటించింది. ఈ అంచనా కూడా తప్పింది. ఇంకా రుతుపవనాలు విస్తరించనేలేదు. ఈ నెల 21వ తేదీ లోపు మధ్యభారతంలో ప్రవేశించే అవకాశాలు లేవని చెబుతున్నారు. దీంతో అనేక ప్రాంతాల్లో వర్షాభావం తప్పదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితులకు రెండు కారణాలు చెప్తున్నారు శాస్త్రవేత్తలు..ఎల్‌నినో ప్రభావంతో.. మేఘాల కదలికలు నెమ్మదిగా ఉన్నాయి. మరోవైపు గుజరాత్ తీరంలో ఏర్పడిన తుపాను కారణంగా తేమ గాలులు అటువైపు తరలిపోవడంతో నైరుతి రుతుపవనాల విస్తరణ ఆగిపోయింది. అందుకే రుతుపవనాలు విస్తరించిన చోట కూడా సరైన వర్షాలు లేవంటోంది వాతావరణశాఖ. బిపర్జోయ్ తుఫాను ఈ నెల 18వ తేదీనాటికి పూర్తిగా బలహీపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాతే రుతుపవనాలు పుంజుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. సో.. ఇంకో మూడు రోజుల తర్వాతే తెలుగు రాష్ట్రాల్లో వర్షాల సీజన్.

# 'స్వచ్ఛ బడి'

## రూ. 71 కోట్లతో రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో 'స్వచ్ఛ బడి': మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : రూ. 71 కోట్లతో రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో స్వచ్ఛ బడిని ప్రవేశపెడుతున్నాం అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. స్వచ్ఛ బడి ద్వారా తడి, పొడి, హానికర చెత్త వేరుచేసే విధానం, కంపోస్టు ఎరువు తయారీ చేసే విధానంపై యువతకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా హైదరాబాద్ శిల్పాకళావేదికలో నిర్వహించిన పట్టణ ప్రగతి వేడుకలకు ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరై ప్రసంగించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని కేటీఆర్ తెలిపారు.


(మిగతా 2లో..)


# బేగంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి స్వాగతం పలికిన కేసీఆర్..



హైదరాబాద్ : బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఆహ్వానించారు. గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, బీజేపీ ఎంపీ కిషన్ రెడ్డి కూడా స్వాగతం పలికారు.సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు మహముద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీలు సంతోష్ కుమార్, వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్‌తో పాటు పలువురు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. ద్రౌపది ముర్ము విమానాశ్రయం నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు చేరుకొని, రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రీవ్యూయింగ్ ఆఫీసర్‌గా హాజరవుతారు. పరేడ్ అనంతరం తిరిగి ఢిల్లీకి వెళ్లిపోతారు.

# గుజరాత్‌లో బిపర్‌జాయ్ బీభత్సం..

## వరద తాకిడికి కూలిన వంతెన.. రోడ్డుపై రాకపోకలు బంద్..



భుజ్: గుజరాత్‌లో బిపర్‌జాయ్ తుఫాను బీభత్సం మొదలైంది. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఒక్కసారిగా కురుస్తున్న ఈ వర్షాల ధాటికి పలుచోట్ల వరదలు పోటెత్తుతున్నాయి. తాజాగా భుజ్ జిల్లాలోని భవానీపూర్ గ్రామంలో బలమైన ఈదురుగాలులు, వరద తాకిడికి రోడ్డుపై నిర్మించిన ఓ బ్రిడ్జి కూలిపోయింది. దాంతో ఆ రోడ్డు గుండా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తిరిగి వంతెనను నిర్మిస్తేగానీ ఆ రోడ్డు గుండా వాహనాల రాకపోకలను పునరుద్ధరించే అవకాశాలు కనిపించడంలేదు.

# లోక్‌సభ ఎన్నికలే టార్గెట్..




## ప్రచారానికి దిగుతున్న అమిత్‌షా, రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ అగ్రనేతలు, మంత్రులు జమ్మూకశ్మీర్‌లో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన విజయాలను హైలైట్ చేస్తూ జమ్మూకశ్మీర్‌లో ఈ నెల చివరి వారంలో ప్రచారానికి నేతలంతా సమాయత్తమవుతున్నారు. ఈనెల 23న భాగ్వతినగర్‌లో జరిగే మెగా ర్యాలీలో అమిత్‌షా పాల్గొంటారు. జూన్ 26న జరిగే "సెక్యూరిటీ కాంక్లేవ్"లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని ప్రసంగిస్తారు. జమ్మూలో ఈనెల 27న జరిగే మరో ర్యాలీలో బీజేవైఎం అధ్యక్షుడు తేజస్వి సూర్య పాల్గొంటారు. సెక్యూరిటీ కాంక్లేవ్ సభాస్థలి ఇంకా ఖరారు కాలేదు. ఆహ్వానితుల జాబితాను బీజేపీ జమ్మూకశ్మీర్ యూనిట్ సిద్ధం చేస్తోంది.కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేత పర్యటనపై రాష్ట్ర జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా మాట్లాడుతూ, ఇప్పటికైతే పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ర్యాలీలు ఉంటాయని, 23న జమ్మూ పార్లమెంటరీ నియోజకవర్గంలో జరిగే మెగా ర్యాలీలో అమిత్‌షా పాల్గొంటారని చెప్పారు. రాజ్‌నాథ్ సింగ్ పాల్గొనే సెక్యూరిటీ కాంక్లేవ్ పూర్తిగా రాజకీయేతరమైన కార్యక్రమమని, భారతీయ సైనిక పాఠం, జాతీయ భద్రతా అంశాలకు సంబంధించిన ఆందోళనలు, సరిహద్దు భద్రతకు సంబంధించిన తీసుకుంటున్న చర్యల గురించి మంత్రి మాట్లాడతారని చెప్పారు.

**370 అధికరణ తర్వాత తొలి లోక్‌సభ ఎన్నికలు**


జమ్మూకశ్మీర్‌లో 370వ అధికరణ రద్దు తర్వాత జరుగనున్న తొలి లోక్‌సభ ఎన్నికలు ఇవే కావడంతో బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్టు చెబుతున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంలోని ఐదు పార్లమెంటరీ స్థానాల్లోనూ బీజేపీ పోటీ చేయనుంది.



## విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై గవర్నర్ తమిళిసై ఆవేదన..

### నివేదిక ఇవ్వాలని ఆదేశం..

బాసర ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలపై గవర్నర్ తమిళిసై ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంపై జోక్యం చేసుకోవాలని వీసీని కోరారు గవర్నర్. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ తీసుకుంటున్న చర్యలపై 48 గంటల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆత్మహత్యల్లాంటి తీవ్ర చర్యలకు పాల్పడొద్దని, సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు గర్నవర్ తమిళిసై. ఇదిలాఉంటే.. బాసర ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. రెండు, మూడు రోజుల్లోనే బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇద్దరు విద్యార్థినిలు ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# 'స్వచ్ఛ బడి'

(మొదటి పేజీ తరువాయి)

టీఎస్ఐపాస్ తరహాలో టీఎస్ బీపాస్‌ను తీసుకొచ్చాం. స్వీయ ధ్రువీకరణతో భవన నిర్మాణానికి అవకాశం ఇచ్చాం. 9 ఏండ్లలోనే సమగ్ర, సమీకృత, సమ్మిళిత, సమతుల్య అభివృద్ధి సాధించాం. దేశంలోనే ఇవాళ బెంగళూరును పక్కన పెట్టేసి.. ఐటీ రంగంలో హైదరాబాద్ ముందంజలో ఉంది. ఐటీ ఎగుమతులు పెరుగుతున్నాయి. ఏక కాలంలో పల్లె ప్రగతి, పట్టణాల ప్రగతి కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి సాధించాయని కేటీఆర్ తెలిపారు.జీహెచ్ఎంసీ పరిధిలో 150 వార్డు కార్యాలయాలను ఒకేరోజు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ఇవి తప్పకుండా విజయవంతం అవుతాయి. గ్రేటర్ పరిధిలో పని చేసే ప్రతి ఉన్నతాధికారి చిత్తశుద్ధితో, పట్టుదలతో పని చేస్తున్నారు. తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అనే నానుడి నిజం చేయబోతున్నాం. ఇప్పటికే ఆ నానుడి అమలవుతోంది. రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలను కేంద్రంతో పాటు పలు రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. భారతదేశంలోని ప్రతి మున్సిపాలిటీ అధికారులు హైదరాబాద్‌కు తప్పకుండా వచ్చి మన వార్డు కార్యాలయాలను ప్రశంసిస్తారనే నమ్మకం ఉంది. పాఠశాలలను బలోపేతం చేసుకుంటున్నాం. మౌలిక వసతులు పెంచుకుంటున్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.టీఎస్ బీపాస్ చట్టం గురించి విని తమిళనాడు సీఎం ఆశ్చర్యపోయారని కేటీఆర్ గుర్తు చేశారు. దీన్ని తాము కూడా అమలు చేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. 9 ఏండ్ల కాలంలో ఒక మున్సిపల్ మంత్రిగా, మా అధికారులు కానీ మేం ఎక్కడా కూడా దిక్కుమాలిన పనులు చేయలేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. అవినీతి రహితంగా పాలన కొనసాగిస్తున్నాం. కేసీఆర్ నాయకత్వంలో పరిశ్రమలకు, భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణ ద్వారా అనుమతులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే అన్ని రంగాల్లో పురోగమనంలో ఉన్నాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.ఇక్కడితోనే సంతోషపడిపోవద్దు.. మనం సాధించాల్సింది ఇంకా ఉంది అని కేటీఆర్ పేర్కొన్నారు. రజనీకాంత్ హైదరాబాద్ అభివృద్ధిని మెచ్చుకున్నారు. ఆయన వందల దేశాలు తిరిగిన వ్యక్తి. ఆయన వచ్చి హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలకు వెళ్తే ఇది న్యూయార్క్‌లా అనిపించిందన్నారు. ఇది మా ఎస్ఆర్‌డీపీ అధికారులు, ఇంజినీర్ల గొప్పతనం. కరోనా కాలంలో అందరూ తమపనులు వదిలి వెళ్లిపోతే.. మా అధికారులు, ఇంజినీర్లు హైదరాబాద్ నగరంలో రాత్రింబవళ్లు పని చేసి రోడ్లను, ఫ్లై ఓవర్లను శరవేగంగా నిర్మించారు. వారికి అభినందనలు. కార్మికుల్లో ధైర్యం నింపి, వారిలో విశ్వాసం నింపి పని కల్పించారు మన అధికారులు అని కేటీఆర్ కొనియాడారు. హైదరాబాద్ నగరంలో 22 వేల మంది శానిటేషన్ సిబ్బంది పని చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. కరోనా సమయంలో బయటకు వచ్చి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచారు. వారికి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. భారతదేశంలో అత్యధిక వేతనం అందుకున్న సఫాయి కార్మికులు మన దగ్గరే ఉన్నారు. సఫాయి కార్మికులకు ప్రజలు సహకారం అందించాలి అని కేటీఆర్ కోరారు.

## మతం మరియు రాజ్యాంగం మధ్య వ్యత్యాసం..




రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాగ్మారే అభిషేక్

1. మతం మీకు వేల సంవత్సరాల బానిసత్వాన్ని ఇచ్చింది, అయితే రాజ్యాంగం మీకు వేల సంవత్సరాల బానిసత్వం నుండి స్వేచ్ఛను ఇచ్చింది.
2. మతం నిన్ను అంటరానివాడిని చేసింది, రాజ్యాంగం నీకు సమానత్వపు హక్కును కల్పించి మనిషిని చేసింది.
3. మతం మీకు విద్యను అందకుండా చేయడం ద్వారా మిమ్మల్ని అభివృద్ధికి దూరం చేసింది, అయితే రాజ్యాంగం మీకు విద్యా హక్కును కల్పించడం ద్వారా అభివృద్ధికి కొత్త మార్గాలను తెరిచింది.
4. మతం మీకు ఆస్తిని హరించడం ద్వారా ఆర్థికంగా మిమ్మల్ని కుంగదీసింది, అయితే రాజ్యాంగం మీకు ఆస్తి, వ్యాపారంపై హక్కును ఇవ్వడం ద్వారా పురోగతికి కొత్త మార్గాలను తెరిచింది.
5. మతం మిమ్మల్ని నగరం, గ్రామం యొక్క ఒక వైపు కాలనీగా మార్చడం ద్వారా మిమ్మల్ని సమాజం నుండి దూరం చేసింది, రాజ్యాంగం మిమ్మల్ని మిగిలిన సమాజంతో కలుపుతుంది మరియు మీకు మనిషి అనే భావనను ఇచ్చింది.
6. మతం నిన్ను నీచంగా మార్చింది, రాజ్యాంగం నిన్ను అందరిలాగే మనిషిని చేసింది.
7. మతం మిమ్మల్ని జంతువుల కంటే హీనంగా భావిస్తుంది, అయితే రాజ్యాంగం మిమ్మల్ని ఏ మానవుడి కంటే తక్కువ కాదు అందరితో నీవు సమానం అని మానవ హక్కులు కల్పించింది.
8. మతం నీటి రూపంలో మీకు జీవితాన్ని దూరం చేసింది, అయితే రాజ్యాంగం మీకు నీటిపై సమాన హక్కులను ఇచ్చింది.

**ఇప్పుడు చెప్పండి మతం గొప్పదా రాజ్యాంగం గొప్పదా.**

# ఎదురు చూపులుఇంకా ఎన్నాళ్లు....?

హైదరాబాద్, జూన్ 16, :తెలుగు రాష్ట్రాలపై వరణుడు కరుణించేదెప్పుడు. ఈ నెలంతా ఎండలే..జాడ లేని రుతుపవనాలు..తెలుగు నేల నిప్పుల కొలిమిలా మండుతోంది. రికార్డు స్థాయిలో నమోదవుతున్న టెంపరేచర్స్ జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. జూన్? 15 దాటినా దడపుట్టిస్తున్న ఎండలు, వడగాడ్పులు. మరో మూడు రోజులు 13 జిల్లాల్లో హీట్? వేవ్స్? కొనసాగుతున్నాయి. వర్షం ఎప్పుడు పడుతుందా అని ఆకాశం వైపు చూస్తున్నారు జనం. రుతుపవనాల ఎంట్రీకి బిపర్?జోయ్ తుఫాన్ ?బ్రేకులు పడినట్లేనా అని అనుమానాలు కలుగుతున్నాయి. కదలని నైరుతి.. 'తొలకరి పలకరింపు' మరింత ఆలస్యం అవుతందనే అనుకుంటున్నారు. ఏపీలోనే నిలిచిపోయిన నైరుతి రుతుపవనాలు. బిపోర్‌జోయ్ తుపానుతో నైరుతి కదలికలపై ప్రతికూల ప్రభావం.ఈ నెల 19 తరువాతే రుతుపవనాల గమనంపై స్పష్టత రానుంది. తొలకరి పలకరింపు లేక రాష్ట్రంలో కొనసాగుతున్న గ్రీష్మతాపం . తొలకరి కోసం రైతుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. గతనెలలో కురిసిన వర్షాలతో తొలకరి సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు.. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్నిచోట్ల విత్తనం, మరికొన్ని చోట్ల దుక్కులు దున్ని ఎదురు చూస్తున్నారు. అయితే 15 రోజులు గడిచినా తొలకరి జల్లులు జాడ కనిపించడం లేదు. మృగశిరలోనూ ఎండలు మండుతున్నాయి. వాతావరణ పరిస్థితితో తొలకరి సాగుపై రైతుల్లో ఆందోళన చెందుతున్నారు.వరుణుడి కటాక్షం కోసం ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెంలో కప్పలకి పెళ్లి జరిపించారు..రోహిణి కార్తె వెళ్లినా కూడా ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో వర్షాలు కురవడం కోసం కప్పలకు పెళ్ళి చేసినట్లుగా కొత్తపేట మండలం వాడపాలెంలో స్థానికులు తెలిపారు. పూర్వం కప్పలకి పెళ్లి చేసి ఊరంతా ఊరేగింపుగా ఉరేగిస్తే వర్షాలు కురిసేవనీ ఇదే తరహాలో వాడపాలెం కప్పలకు పెళ్ళి చేసినట్లు చెప్తున్నారు గ్రామస్తులు..అటు తెలంగాణలోని వరంగల్ జిల్లాలో భానుడు శాంతించాలి.. నైరుతి రుతుపవనాలు త్వరగా రావాలని వేసుకుంటూ పూజలు నిర్వహిస్తున్నారు.. కాజిపేటలోని శ్వేతార్క మూల గణపతి దేవాలయంలో 108 కీలోల వెన్నతో అభిషేకాలు నిర్వహించారు..

## ఒకే రోజు 71 తీర్పులు వెల్లడించిన జస్టిస్ నందా

హైదరాబాద్, జూన్ 16, :తెలంగాణ హైకోర్ట న్యాయమూర్తి సూరేపల్లి నంద కొత్త రికార్డు సృష్టించారు. ఏకంగా ఒక్క రోజు 71 తీర్పులను వెలువరించి చరిత్ర తిరగరాశారు. హైకోర్టు చరిత్రలో నందా ఇచ్చిన తీర్పులు విశేషమైనవి, అసమానమైనవి భావిస్తున్నారు. వేసవి సెలవుల తర్వాత హైకోర్టు పున: ప్రారంభం రోజునే అనేక తీర్పులు వెల్లడించారు. ఈ కేసులు న్యాయమూర్తి ప్రస్తావించిన అంశాలు చోటుచేసుకున్నాయి. మరో వైపు న్యాయమూర్తి సూరేపల్లి నందా కోర్టులో తీర్పులు చెప్పడం ద్వారా న్యాయ ప్రక్రియలో పారదర్శకతను పెంచాయి. ఒకేసారి గణనీయ సంఖ్యలో తీర్పులు నిస్సందేహంగా కేసుల బ్యాక్‌లాగ్‌ను కొంతమేరకు తగ్గించదనడంలో ఎలాంటి సందేహం లేదు. కోర్టులో పేరుకుపోతున్న కేసుల నేపథ్యంలో బ్యాక్‌లాగ్‌లను క్లియర్ చేయడం ద్వారా న్యాయస్థాన వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. వ్యాజ్యదారులకు సకాలంలో న్యాయాన్ని అందించడంలో సహాయపడుతుంది న్యాయవ్యవస్థ యొక్క సమర్థవంతమైన పనితీరును ప్రోత్సహిస్తుంది. జడ్జి సూరేపల్లి నందా ఒకేసారి పెద్ద ఎత్తున తీర్పులతో న్యాయ వ్యవస్థ పై ప్రభావం పడి విశ్వసనీయతకు దోహదం చేస్తాయి. 1969లో జన్మించిన సూరేపల్లి నందా... 28 ఏళ్లపాటు హైకోర్టులో సివిల్, క్రిమినల్ సహా అన్ని విభాగాల్లో ప్రాక్టీస్ చేశారు. బీఏ ఇంగ్లీష్ లిటరేచర్, ఎల్ఎల్‌బీ విద్యను పూర్తిచేశారు. 1993లో హైకోర్టు న్యాయవాదిగా నమోదు చేయించుకున్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫున అనేక కార్యక్రమాల్లో సేవలు అందించారు. ఇటీవలే హైకోర్టు ఆమెను డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాదిగా గుర్తించి న్యాయమూర్తిగా అవకాశం ఇచ్చారు.

## 100 రూపాయిల టిక్కెట్ తో పల్లె వెలుగులో ఫ్రీ

హైదరాబాద్, జూన్ 16, :గ్రామీణ, పట్టణ ప్రయాణికులకు ఆర్థికభారం తగ్గించేందుకు టీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. పల్లె వెలుగు బస్సులో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టి-9 టికెట్ అందుబాటులోకి తెచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో టి-24, టి-6, ఎఫ్-24 టికెట్లను ఇప్పటికే అందిస్తోన్న సంస్థ.. తొలిసారిగా గ్రామీణ, పట్టణ ప్రయాణికుల సౌకర్యార్థం టి-9 టికెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని




నిర్ణయించింది.హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో శుక్రవారం టి-9 టికెట్ పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ ఆవిష్కరించారు. ఈ టికెట్ ఈ నెల 18(ఆదివారం) నుంచి పల్లె వెలుగు బస్సుల్లో కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. టి-9 టికెట్ పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు వర్తిస్తుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఈ టికెట్ చెల్లుబాటు అవుతుంది. ఈ టికెట్ ద్వారా 60 కిలోమీటర్ల పరిధిలో ఒక్కసారి రానూపోను ప్రయాణం చెయొచ్చు. టి-9 టికెట్ కు రూ.100 ధరగా టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. టోల్ గేట్ చార్జీలపైన మినహాయింపు ఇచ్చింది. దీంతో ఈ టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతందని సంస్థ ప్రకటించింది. 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు వయసు ధృవీకరణ కోసం తమ ఆధార్ కార్డును కండక్టర్లకు చూపించి టి-9 టికెట్ పొందవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఈ టికెట్లను కండక్టర్లు ఇస్తారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలోనే ఈ టికెట్ చెల్లుబాటు అవుతుంది. "పల్లె వెలుగు బస్సుల్లో ప్రతి రోజు సగటున 15 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అందులో మహిళలు, సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ఉన్నారు. వారికి ఆర్థికభారం తగ్గించాలనే ఉద్దేశంతోనే పల్లెవెలుగు బస్సుల్లో టి-9 టికెట్‌కు టీఎస్ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఈ టికెట్ తో రూ.100 చెల్లించి 60 కిలోమీటర్ల పరిధిలో రానూపోను ప్రయాణించవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని సంస్థను ఆదరించాలి." అని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇప్పటికే టి-24, టి-6, ఎఫ్-24 టికెట్లను అందుబాటులోకి తెచ్చామని, వాటికి ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన వస్తోందని గుర్తు చేశారు. ఆ టికెట్లకు మంచి స్పందన వస్తుండటంతో తొలిసారిగా గ్రామీణ, పట్టణ ప్రయాణికుల కోసం 'టి-9 టికెట్'ను తీసుకువచ్చామని చెప్పారు. ఈ టికెట్ కు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. 'టి-9 టికెట్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)లు, పీవీ ముని శేఖర్, పురుషోత్తం, కృష్ణ కాంత్, సీటీఎం జీవన్ ప్రసాద్, సీఎంఈ రఘునాథరావు, సీఈఐటీ రాజశేఖర్, సీఎఫ్ఎం విజయపుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, జూన్ 16, :శుక్రవారం, శనివారం హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరానికి రాబోతున్నారు. ఈ క్రమంలోనే శుక్ర, శని వారాల్లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉండబోతున్నాయి. ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు.. 17వ తేదీ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీటీఓ జంక్షన్, పీఎన్బీ ఫ్లైఓవర్, జంక్షన్, హెచ్పీఎస్ స్కూల్ ఔట్ గేట్, బేగంపేట ఫ్లైఓవర్, గ్రీన్ ల్యాండ్స్ జంక్షన్, మోనప్ప జంక్షన్, యశోద హాస్పిటల్ రోడ్డు, ఎంఎంటీఎస్, వీవీ స్టాచ్యూ జంక్షన్, పంజాగు?ట జంక్షన్, ఎన్ఎఫ్సీఎల్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు తలెత్తాయి. సికింద్రాబాద్ నుంచి వయా బేగంపేట మీదుగా అమీర్ పేట, మెహదీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు ఈ రూట్ లో రాకుండా అప్పర్ ట్యాంక్ బండ్ పై దారి మళ్లించనున్నారు. రాజ్ భవన్ రోడ్, మోనప్ప జంక్షన్, వీవీ స్టాచ్యూ ఈ మార్గాల్లో రెండువైపులా రోడ్ మూసేశారు. పంజాగుట్ట రాజ్ భవన్ క్వార్టర్స్ రోడ్డులో వాహనాలకు అనుమతి లేదు. సీటీఓ జంక్షన్, మినిస్టర్ రోడ్డులో వచ్చే వాహనాలను రసూల్ పురా జంక్షన్ వద్ద కొంత సమయం పాటు నిలిపివేస్తారు. పంజాగుట్ట, గ్రీన్ ల్యాండ్స్ మీదుగా బేగంపేట ఎయిర్ పోర్టు మీదుగా వచ్చే వాహనాలను ప్రకాష్ నగర్ టీ జంక్షన్ వద్ద కొంత సమయం నిలుపుదల చేస్తారు. ఈ రూట్ లలో ప్రయాణించే వాహనదారులు ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని పోలీసులు సూచించారు. విషయం తెలియకుండా వస్తే ట్రాఫిక్ లో ఇరుక్కు పోవాల్సిందేనని చెప్పారు. అసలే ఎండాకాలం కాబట్టి త్వరగా ఇళ్లకు, ఆఫీసులకు వెళ్లిపోయే ప్రయత్నం చేయాలన్నారు.

## నాపై కేసు దారుణం హరగోపాల్

హైదరాబాద్, జూన్ 16, :తెలంగాణ పోలీసులు పెట్టిన రాజద్రోహం కేసుపై ప్రొఫెసర్ హరగోపాల్ స్పందించారు. 152 మందిపై ఉపా చట్టం కింద కేసు పెట్టడం దుర్మార్గమన్నారు. 'పోలీసుల అత్యుత్సాహంతోనే నాపై ఉపా చట్టం కింద కేసు పెట్టారు. ప్రభుత్వ పెద్దలకు తెలిసి నాపై కేసు నమోదైందని అనుకోవడం లేదు. నేను ఏ మావోయిస్టును కలిశానో.. ఎక్కడ సమావేశమయ్యానో డీజీపీ చెప్పాలి. తెలంగాణలో మావోయిస్టులే లేరన్న డీజీపీ ఎక్కడ సమావేశమయ్యారో చెప్పాలి. నాపై నమోదైన కేసుపై పౌరసమాజం స్పందించిన తీరు సంతృప్తినిచ్చింది. ఐఏఎస్ స్థాయి అధికారులు కూడా నాపై పెట్టిన కేసును వ్యతిరేకిస్తున్నారు. ఇది పోలీసుల అత్యుత్సాహం కావొచ్చు' అని హరగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రొఫెసర్ హరగోపాల్‌పై ఉపా కింద కేసు పెట్టడంపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు భగ్గుమంటున్నాయి.కాగా 2002 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పీఎస్ లో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం యూఏపీఏ కింద హరగోపాల్ పై కేసు నమోదు చేశారు. యూఏపీఏ, ఆర్మ్స్ యాక్ట్ తో పాటు 10 సెక్షన్ల కింద హరగోపాల్ తో పాటు 152 మందిపై కేసు నమోదు చేశారు పోలీసులు. అలాగే మావోయిస్టు పుస్తకాల్లో హరగోపాల్ పేరుందని, ప్రజా ప్రతినిధులపై దాడికి కుట్ర చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు.పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్‌పై దేశద్రోహం కేసు నమోదు అయింది. ఉపా చట్టం కింద గత ఏడాది ఆగస్టులో 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ లో కేసు ఫైల్ అయింది. ఇదే కాక ఆయుధాల చట్టం, సెక్షన్ 10 కింద కేసులు నమోదు అయ్యాయి. హరగోపాల్‌తో పాటు 152 మంది ఉద్యమకారులు, మేధావులు ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా ఉన్నారు.పీపుల్స్ డెమొక్రటిక్ మూవ్‌మెంట్ (పీడీఎం) అధ్యక్షుడు చంద్రమౌళిని రెండు నెలల కింద పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, అతడిపై మరిన్ని కేసులు ఉన్నాయని, బెయిల్‌పై విచారణ చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తెలియజేశారు. మొత్తం అన్ని కేసుల వివరాలూ అందజేయాలని కోర్టు ఆదేశించడంతో పోలీసులు ఈ ఎఫ్ఐఆర్‌ను కోర్టు ముందు పెట్టారు. దీంతో ఈ విషయం బయటపడింది.ప్రొఫెసర్ హరగోపాల్ మావోయిస్టులకు సహాయసహకారాలు అందిస్తున్నారని, బీరెల్లి కుట్రలో ఆయన భాగం అయ్యారని, పైగా నిషేధిత మావోయిస్టుల పుస్తకాల్లో ఆయన పేరు ఉందనే అభియోగాలు నమోదు అయ్యాయి. ఇంకా మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు పుల్లూరు ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ఆయుధాల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం, ప్రభుత్వాన్ని కూలదోయడం, పార్టీకి నిధులు సమకూర్చుకోవడం, అమాయక యువకులను మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్ చేసుకోవడం వంటి పనులు చేసినట్లు పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. నిందితులుగా ఉన్న వారిలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ముంబై హైకోర్టు జడ్జిగా పనిచేసిన సురేశ్ (జస్టిస్ సురేశ్ ఎఫ్ఐఆర్ నమోదయ్యేనాటికే చనిపోయారు) ప్రొఫెసర్ పద్మజా షా, హైకోర్టు సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్, చిక్కుడు ప్రభాకర్ తదితరుల పేర్లు ఉన్నాయి.ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా లాంటి వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తేయాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవాచారి డిమాండ్ చేశారు. మరోవైపు విద్యా మేధావులను ఇరికించడం వెనుక కుట్ర ఉందని, కేసు వివరాలను బహిర్గత పర్చాలని విద్యా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## స్టాలిన్ కు అన్నామలై వార్నింగ్

చెన్నై, జూన్ 16, :తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టుతో అక్కడి రాజకీయాలు వేడెక్కాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటికే బీజేపీపై డైరెక్ట్ వార్ ప్రకటించారు. "అనవసరంగా రెచ్చగొట్టద్దు" అంటూ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీకి హెచ్చరికలు చేస్తూ ఓ వీడియో కూడా విడుదల చేశారు. "మా క్యాడర్ జోలికి రావద్దు" అని తేల్చి చెప్పారు. దీనిపై తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నమలై తీవ్రంగా స్పందించారు. శివగంగలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన...స్టాలిన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ క్యాడర్‌కి వార్నింగ్ ఇచ్చి స్టాలిన్ హద్దులు దాటారని మండి పడ్డారు. కనిమొళిని అరెస్ట్ చేసినప్పుడు కూడా స్టాలిన్ ఇంతగా అసహనానికి లోనుకాలేదని సెటైర్లు వేశారు. "కనిమొళిని అరెస్ట్ చేసినప్పుడు కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ ఇలా అసహనానికి గురి కాలేదు. అంటే...తమిళనాడు ప్రజలు అనుకుంటున్నట్టుగానే...సెంథిల్ బాలాజీ డీఎమ్‌కే పార్టీకి ట్రెజరర్‌గా పని చేస్తున్నాడు. బీజేపీకి వార్నింగ్ ఇచ్చి ఆయన హద్దులు దాటి మాట్లాడారు. మా క్యాడర్‌ని ముట్టుకోవద్దని వార్నింగ్ ఇస్తారా. నేనూ అదే అంటున్నా. బీజేపీ క్యాడర్‌ని టచ్ చేసి చూడండి. మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరు. కచ్చితంగా దీటైన బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రెండేళ్లుగా తమిళనాడు ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేకపోయింది ఈ ప్రభుత్వం"సెంథిల్ బాలాజీ అరెస్ట్ తరవాత తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కేంద్రదర్యాప్తు సంస్థలు రాష్ట్రంలో అడుగు పెట్టడానికి వీల్లేదని ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఇస్తేనే సీబీఐ రాష్ట్రంలోకి రావాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. దాంతో తెలంగాణ, పశ్చిమ బెంగాల్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాల బాటలో తమిళనాడు నడుస్తున్నట్లు అయింది. తమిళనాడు ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇకపై ఏదైనా దర్యాప్తు చేయడానికి ముందు సీబీఐ ఈ రాష్ట్ర ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం తీసుకున్న పదో రాష్ట్రంగా నిలిచింది తమిళనాడు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షపార్టీల నేతల్ని ఇబ్బందులకు గురిచేసేందుకు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. అందువల్లే తాము రాష్ట్రంలో సీబీఐ విచారణకు రావాలంటే సాధారణ అనుమతిని ఉపసంహరించుకుంటూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు మంత్రి వి సెంథిల్ బాలాజీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఅ) దాడులపై తీవ్రంగా స్పందించారు. రాజకీయ ప్రత్యర్థులను బెదిరింపులకు గురిచేయడానికి ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను ఉసిగోల్పుతున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్ నివాసాలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించింది. దాదాపు 17 గంటల పాటు ఈ సోదాలు జరిగాయి. తరవాత చెన్నై నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయానికి తరలించారు. సెంథిల్ బాలాజీని విచారణ కోసం తీసుకెళ్లారా లేక అరెస్టు చేశారా అనే దానిపై సందిగ్ధత నెలకొనగా, ఆయనను అరెస్టు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. సెంథిల్ బాలాజీని అధికారులు తీసుకెళ్తుండగా అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో ఆయనను ఒమందురార్ ప్రభుత్వాసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్పించారు. ఆయన్ను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ఏడుస్తూ కనిపించారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కొరకు జిల్లా ఆర్యవైశ్య ఆధ్వర్యంలో ఎంపి నామా నాగేశ్వరరావుకి వినతి పత్రం



మధిర జూన్ 16 ప్రజా పాలన ప్రతినిధి: తెలం గాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వనమా వేణుగోపాల రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఖమ్మం ఎం పి నామా నాగేశ్వర రావు ని కలిసి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కొరకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వనమా వేణుగోపాలరావు (సూరి), మాజీ జిల్లా అధ్యక్షులు ఇరుకుళ్ళ లక్ష్మీ నరసింహారావు, మధిర వర్తక సంఘం మాజీ అధ్యక్షులు రంగా అప్పారావు, జిల్లా మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ చారుగుండ్ల వెంకట లక్ష్మీ నరసింహారావు, జిల్లా అధికార ప్రతినిధి కుంచం కృష్ణారావు, పుల్లఖండం చంద్రశేఖర్, టిఆర్ఎస్ మధిర టౌన్ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, రామాలయం చైర్మన్ పల్లపోతు ప్రసాదరావు, మధిర టౌన్ అధ్యక్షులు వనమా కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వంగవేటి రాజశేఖర్, కోశాధికారి వేములపల్లి శ్రీనివాసరావు, చెడే రామకోటేశ్వరరావు, కాజా చక్రధర్ రావు, వెచ్చ వీరభద్రరావు, జల్లా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## భరత్ పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం



మధిర జూన్ 16 ప్రజాపాలన ప్రతినిధి: మధిర పట్టణంలోని భరత్ కిడ్స్ అండ్ టెక్నో స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత వెంకటరెడ్డి ఆదేశాల మేరకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధిర మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ హాజరై పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సరస్వతీ పూజలో పాల్గొని తదుపరి చిన్నారుల చేత అక్షరాభ్యాసాలు చేయించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, రమ్య రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలోని చిన్నారులకు పలకలు, బలపాలు, నోట్ పుస్తకాలని ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, డీన్ రవీందర్ రెడ్డి, ఉమా, స్రవంతి, నాగరాజు, అజీమ్, గణేష్, భాస్కర్, స్నేహిత, త్రివేణి, రమ్య, శిల్ప, లావణ్య, జ్యోతి, సీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జోగిపేట పట్టణ ప్రగతి దినోత్సవం







హైదరాబాద్ 1 6 జూన్ ప్రజాపాలన: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 వ తేదీ నుండి 22 లో తేదీ వరకు రోజు వారి కార్యక్రమాలతో ప్రణాళిక తయారు చేసి అదే వరుస క్రమంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. దీనిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా రోజు వారీగా కార్యక్రమా లను వివిధ శాఖల అధికారులు ఆయా జిల్లా పరిపాలనా అధికారుల సారధ్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. జూన్ 16 తేదీ న పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా మున్సిపల్ పరిధిలో మంత్రులు స్థానిక శాసన సభ్యులు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ లు మున్సిపల్ చైర్మన్‌లు కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు నాయకులు అధికారులను సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులను పారిశుద్ధ్య కార్మికులను సిబ్బందిని రాష్ట్ర వ్యాప్తంగా సత్కరించారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట మున్సిపల్ పరిధిలో స్థానిక శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ ఆద్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రైవేటు పంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన ఎం.ఎల్.ఏ. చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . మున్సిపల్ చైర్మన్ చైర్మన్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి అయిన జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణ అధికారి పాల్గొ న్నారు. మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు.

## కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో అబ్బురపర్చే అభివృద్ధిలో దూసుకుపోతున్న పట్టణాలు, నగరాలు

మధిర: రాబోయే కాలంలో కేసీఆర్ కు అండగా ఉండాలి 10 కి 10 సీట్లు గెలిచి, కేసీఆర్ కు బహుమతిగా ఇద్దాంమధిర పట్టణ ప్రగతి కార్యక్రమంలో బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావుసీఎం కేసీఆర్ దార్శనికత, యువ నాయకుడు, మంత్రి కేటీఆర్ దిశ నిర్దేశకత్వం, నాయకత్వంలో తెలంగాణాలో 9 ఏళ్లలో ప్రపంచాన్ని అబ్బురపరిచే రీతిలో బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగిందని బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారుశుక్రవారం పండుగ వాతావరణంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత అధ్యక్షతన మధిరలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడారు. కేసీఆర్ విప్లవాత్మకమైన సరికొత్త ఆలోచనలు , సంస్కరణల ఫలితంగానే దేశంలోనే నెంబర్ వన్ అభివృద్ధి జరుగిందని అన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అనూహ్య ప్రగతిలో దూసుకుపోతు న్నాయని అన్నారు. వైకుంఠ దామాల నిర్మాణం ఒక చరిత్ర అన్నారు. తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారని అన్నారు. ప్రపంచమే అబ్బురపడే విధంగా హైదరాబాద్ నగరాన్ని కేసీఆర్ అభివృద్ధి చేశారని అన్నారు. రాబోయే కాలంలో కేసీఆర్ కు మరింత అండగా ఉండి, మంచి మెజార్టీతో గెలిపించుకొని , మరింత అభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలోని 10 సీట్లను గెల్చుకొని కేసీఆర్ కు బహుమతిగా ఇద్దామని నామ అన్నారు. ఈ సందర్భంగా వేదికపై మున్సిపల్ కార్మికులను సన్మానించారు. అంతకు ముందు నామ మీటింగ్ హాలు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బతుకమ్మలతో స్వాగతం పలికారు. మధిర మున్సిపల్ ఛైర్ పర్సన్ మొండితోక లత గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు , జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు , రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు , జిల్లా అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి , పార్టీ నాయకులు వెంకట రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, మొండితోక జయాకర్ , రంగిశెట్టి కోటేశ్వరరావు, చావా రామకృష్ణ, కనుమూరి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, చావా వేణు, దిశ వెంకటేశ్వర్లు, అప్పారావు, మల్లాది వాసు, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ రమాదేవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవంలో ఎంపీ నామా




మధిర, జూన్ 16 ప్రజాపాలన ప్రతినిధి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈరోజు పట్టణ ప్రగతి దినోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్పర్సన్ మొండితోక లత జయకర్ ఆధ్వర్యంలో స్థానిక రెడ్డి గార్డెన్ నందు నిర్వహించ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ జనాభాకు మెరుగైన జీవన ప్రమాణాలు, పట్టణ ప్రాంతాలను పరిశుభ్రంగా, పచ్చగా మార్చే లక్ష్యంతో "పట్టణ ప్రగతి" కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం. నూతన మున్సిపల్ చట్టాన్ని పటిష్టంగా రూపొందించి అమలు సీఎం శ్రీ కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా మంత్రి కేటీఆర్ మార్గనిర్దేశంలో మున్సిపల్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. మున్సిపాలిటీలకు ప్రతీ నెలా నిధులు.. సెంటర్ లైటింగ్, టాంక్ బండ్, మధిరలో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు, 100 బెడ్స్ హాస్పటిల్, టీఎస్బీపాస్ చట్టం అమలుతో ఇండ్ల నిర్మాణాల అనుమతుల ప్రక్రియ సులభతరం చేస్తూ తెలంగాణ ప్రభుత్వంలో మధిర ఎంతో అభివృద్ధి చెందింది. అదే కాదు రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీలు అభివృద్ధికి ముఖ్య కారణం మన ముఖ్యమంత్రి కేసీఆర్. మన ముఖ్యమంత్రి కేసీఆర్ మరొకసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందాం అని అన్నారు ఎంపీ నామా నాగేశ్వరరావు.

## కెసిఆర్, కేటీఆర్ నాయకత్వంలో దూసుకుపోతున్న పట్టణాలు నగరాలు

### ఖమ్మం పార్లమెంటు సభ్యులు నామా నాగేశ్వరరావు



మధిర జూన్ 16 ప్రజాపాలన ప్రతినిధి:కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో అబ్బురపర్చే అభివృద్ధి లో పట్టణాలు, నగరాలు దూసుకుపోతున్నాయి. రాబోయే కాలంలో కేసీఆర్ కు అండగా ఉండాలి 10 కి 10 సీట్లు గెలిచి, కేసీఆర్ కు బహుమతిగా ఇవ్వాలని మధిర పట్టణ ప్రగతి కార్యక్రమంలో బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సీఎం కేసీఆర్ దార్శనికత, యువ నాయకుడు, మంత్రి కేటీఆర్ దిశ నిర్దేశకత్వం, నాయకత్వంలో తెలంగాణాలో 9 ఏళ్లలో ప్రపంచాన్ని అబ్బురపరిచే రీతిలో బ్రహ్మాండమైన అభివృద్ధి జరిగిందని బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పండుగ వాతావరణంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత అధ్యక్షతన మధిరలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడారు. కేసీఆర్ విప్లవాత్మకమైన సరికొత్త ఆలోచనలు , సంస్కరణల ఫలితంగానే దేశంలోనే నెంబర్ వన్ అభివృద్ధి జరుగిందని అన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అనూహ్య ప్రగతిలో దూసుకుపోతు న్నాయని అన్నారు. వైకుంఠ దామాల నిర్మాణం ఒక చరిత్ర అన్నారు. తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారని అన్నారు. ప్రపంచమే అబ్బురపడే విధంగా హైదరాబాద్ నగరాన్ని కేసీఆర్ అభివృద్ధి చేశారని అన్నారు. రాబోయే కాలంలో కేసీఆర్ కు మరింత అండగా ఉండి, మంచి మెజార్టీతో గెలిపించుకొని , మరింత అభివృద్ధికి అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలోని 10 సీట్లను గెల్చుకొని కేసీఆర్ కు బహుమతిగా ఇద్దామని నామ అన్నారు. ఈ సందర్భంగా వేదికపై మున్సిపల్ కార్మికులను సన్మానించారు. అంతకు ముందు నామ మీటింగ్ హాలు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బతుకమ్మలతో స్వాగతం పలికారు. మధిర మున్సిపల్ ఛైర్ పర్సన్ మొండితోక లత అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు , జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు , రైతు బంధు జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు , జిల్లా అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి , పార్టీ నాయకులు వెంకట రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, మొండితోక జయాకర్ , రంగిశెట్టి కోటేశ్వరరావు, చావా రామకృష్ణ, కనుమూరి వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, చావా వేణు, దిశ వెంకటేశ్వర్లు, అప్పారావు, మల్లాది వాసు, మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ రమాదేవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం జూన్ తేదీ 16 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ రోజు పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఎస్పీఆర్ శ్రీరాస్తూ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన పట్టణ ప్రగతి వేడుకలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పారిశుధ్య కార్మికులు ఎంతో శ్రమించి పనిచెరని ఎమ్మెల్యే వారందరినీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు.

## ఆలేరు ఎన్.సి.సి. అధికారి దూడల వెంకటేశ్‌కు డిజి బ్యాటన్ ప్రధానం




యాదాద్రి భువనగిరి జిల్లా 16 జూన్ ప్రజాపాలన:ఎన్. సి. సి. లో ప్రతిష్టాత్మకమైన డిజి బ్యాటన్ ని ఆలేరు ఎన్.సి.సి. అధికారి దూడల వెంకటేష్ కు పదవ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ అజయనంద ఖండూరి అందజేశారు. ఎన్. సి. సి. లో అత్యుత్తమ సేవలకు గాను ఈ డిజి బ్యాటన్ ని బెటాలియాన్ లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరు అధికారులు కూడా కష్టపడి పనిచేసి అవార్డులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్నల్ అజయనంద ఖండూరి తో పాటు ఆడమ్ ఆఫీసర్ మహేష్ జగతప్, సుబేదార్ మేజర్ సుహాస్ కదం, అధికారులు గౌస్, నారాయణ రెడ్డి, విజయ్, ఉమేశ్ పాస్తా, సంతోష్ గౌడ, కుమార స్వామి అలా వరుసగా అవార్డులు పొందటం పట్ల బెటాలియాన్ ఎన్.సి. సి. అధికారులు కెప్టెన్ సతీష్, లెఫ్ట్ నెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి, మహేష్ రాధాకృష్ణ, రాజయ్య, ప్రవీణ్ కుమార్ తదితరులు అభినందించారు. డిజి బ్యాటన్ పొందటం తో ఆలేరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. నారాయణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సీస గోవర్ధన్ ఉపాధ్యాయులు బంధు మిత్రులు తదితరులు వెంకటేష్ కు అభినందనలు తెలిపారు.

## కేసీఆర్ పాలనలో అభివృద్ధి

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి: కెసిఆర్ పాలన ఆసరా పింఛన్లు అందులో మాతా శిశు కేంద్రం పత్రి నిర్మాణం పట్టణంలో వివిధ రోడ్ల అభివృద్ధి తత్తర కార్యక్రమాల ప్రాంతం అభివృద్ధి చెందిందని తాండూర్ శాసనసభ్యులు పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజు తాండూర్



పట్టణంలో జరిగిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా గాంధీ చౌక్ దగ్గర జాతీయ పతాక ఆవిష్కరణ చేసి మానవ హారంచేసిన అనంతరం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిమున్సిపల్ కార్యాలయంలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాండూరులో పచ్చదనం అభివృద్ధి కోసం అనేక మొక్కలను పెంచి పచ్చదనం పెంచడంలో ముఖ్యమంత్రి తెరవతో ప్రకృతి అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కల్యాణ లక్ష్మి రైతుబంధులంటే అనేక పథకాల ప్రవేశ పెట్టడంతో ప్రజాకర్షణ పొందాలని ప్రజా హృదయనేతగా పేరు తెచ్చుకున్నారని ఆయన తెలిపారు. తాండూర్ ప్రాంతాభివృద్ధికి ఆయన నిధులు విడుదల చేశారని తెలిపారు. అన్ని రంగాల్లో తాండూర్ అభివృద్ధి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ స్వప్న. మున్సిపల్ వైస్ చైర్మన్ దీప నర్సింలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్ తాండూర్ పట్టణ అధ్యక్షులు అప్పునయుం కౌన్సిలర్లు తరులు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
శనివారం 17, జూన్ 2023

## 'పవర్'ఫుల్ షహర్ హమారా

విద్యుత్ ప్రవాహ వేగంతో అభివృద్ధి చెందుతూ హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకోవడానికి అవసరమైన, అత్యున్నత మౌలిక సదుపాయాల్లో కరెంటు అత్యంత ప్రధానమైనది. నిరంతరాయ విద్యుత్తు సరఫరా లేని నగరంలో అభివృద్ధిని ఆశించలేం. 2012వ సంవత్సరం అనుకుంటాను. హైదరాబాద్ నగరంలో పగలు 2 గంటలు, సాయంత్రం 2 గంటలు కరెంటు కోతలు అమలవుతున్నాయి. పారిశ్రామిక వాడలకు, ఐటీ కంపెనీలకు వారంలో రెండు రోజులు 'పవర్ హాలిడే'.ఓ రోజు ఉదయం ఒక పారిశ్రామికవేత్త ఫోన్‌జేసి 'మీరు 2 రోజులు పవర్ హాలిడే ఇస్తున్నారు. పరిశ్రమ ఆవరణలో నివాసం ఉంటున్న కార్మికులు నీళ్లు పట్టుకోవడానికిగాను గంటసేపు కరంటు ఇవ్వగలరా?' అని అభ్యర్థించారు. ఉన్నతాధికారులు ఇవ్వకూడదన్నారు. 15 నిమిషాల కంటే ఎక్కువ కరెంటు ఇస్తే ఫీడర్ మీటర్లలో రికార్డవుతుంది. దీనికితోడు నిబంధనలు ఉల్లంఘించి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజినీర్లు కరెంటు ఇస్తున్నారా అని విజిలెన్స్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేసేవారు. కరెంటు ఇవ్వకుండా మాకు ఎన్నో ఆంక్షలు. కరెంటు కోతల గురించి ప్రశ్నించినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి 'కిటీకలు తెరిస్తే గాలి ఆడుతుంది' అంటూ శాస్త్రీయ, సాంకేతిక ఉచిత సలహాలు ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క ఏడాదిలోగా పరిస్థితులను తారుమారు చేసేశారు. రాష్ట్రాభివృద్ధికి గుండెకాయ లాంటి హైదరాబాద్ నగరంలో అన్నివర్గాల వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్తు సరఫరా గావించడానికి అవసరమైన ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థలను పటిష్ఠపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను తక్కువ సమయంలోనే నిర్మించింది. హైదరాబాద్ నడిబొడ్డున అత్యంత జనసమ్మర్దం ఉండే రాయదుర్గం ప్రాంతంలో గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ (జీఐఎస్)గా పిలవబడే 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ, 33 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మాణమయ్యాయి. ఇవన్నీ ఐదెకరాల కనీస విస్తీర్ణంలో నిర్మించడం అభినందనీయం. తక్కువ స్థలంలో, తక్కువ సమయంలో నిర్మించడానికి అవకాశం ఉన్న మోనోపాల్ టవర్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని మొదటిసారి వినియోగించి ఈ సబ్‌స్టేషన్‌లో 500 మెగా వోల్ట్ ఆంపియర్ సామర్థ్యం కలిగిన రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొల్పారు. భవిష్యత్తులో మరో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించనున్నారు. తద్వారా హైదరాబాద్ నగరానికి 2000 మెగావాట్ల అదనపు ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం చేకూరుతుంది. అదేవిధంగా 220 కేవీ సబ్‌స్టేషన్‌లో 160 ఎంవీఏ సామర్థ్యం కలిగిన మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 132 కేవీ పరిధిలో 80 ఎంవీఏ సామర్థ్యం ఉన్న మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించారు. రాబోయే ఇరువై ఏండ్లలో ఏర్పడబోయే సుమారు 1600 మెగావాట్ల విద్యుత్ అవసరాలను తీర్చడవే ప్రధాన ధ్యేయంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. హైదరాబాద్ నగరం చుట్టూ తొమ్మిది 400 కేవీ సబ్‌స్టేషన్లు మల్కారం, ఘణపూర్, మామిడిపల్లి, మహేశ్వరం, కేతిరెడ్డిపల్లి, శంకర్‌పల్లి, గజ్వేల్, నర్సాపూర్‌లో ఏర్పాటుచేయడంతో వలయాకార గ్రిడ్ నిర్మాణం పూర్తయ్యింది. దీంతో అత్యంత పకడ్బందీ వ్యవస్థ నడుమ హైదరాబాద్ నగరం సురక్షితంగా ఉంటున్నది. డిస్ట్రిబ్యూషన్ రంగం విషయానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిదేండ్లలో అద్భుత, అనితర సాధ్యమైన ఫలితాలను సాధించింది. ప్రజలతో నిరంతరం ప్రత్యక్ష సంబంధాలుండే డిస్కం 58 లక్షల మంది నగర ప్రజలకు సేవలందిస్తున్నది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 316 ఉండగా, 11 కేవీ ఫీడర్లు 3,194 ఉన్నాయి. వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తు సరఫరాలో ఎస్‌సీఏడీఏ పాత్ర గణనీయమైనది. జీహెచ్‌ఎంసీ పరిధిలో 4,982 కిలోమీటర్ల 33 కేవీ లైన్లు, 1009 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, 21,658 కిలోమీటర్ల 11 కేవీ లైన్లు నిర్మించుకున్నాం. హైదరాబాద్ పరిధిలో 1,39,610 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా 56,229 కిలోమీటర్ల ఎల్‌టీ లైన్లున్నాయి. 2014కు 2,261 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదవ్వగా 2023 మే 19న జీహెచ్‌ఎంసీ పరిధిలో 3,756 మెగావాట్ల రికార్డు డిమాండ్ నమోదయ్యింది. కరోనా కాలం మినహాయిస్తే విద్యుత్ వినియోగం 12 శాతానికి పైగా ఏటా పెరుగుతున్నది. అభివృద్ధి చెందిన నగరాలతో సమానంగా దీన్ని పేర్కొనవచ్చు. హైదరాబాద్ పరిధిలో విద్యుత్తు పంపిణీ మెరుగు కోసం ప్రభుత్వం రూ. 3,313 కోట్లు వెచ్చించింది. వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్తు సరఫరా నిమిత్తం వేల కోట్ల రూపాయలు వెచ్చించడవే కాకుండా గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు పారదర్శకంగా అత్యున్నత ప్రమాణాలతో సేవలందించడానికి ఎన్నో వినూత్నమైన పద్ధతులను అవలంబిస్తున్నది. వినియోగదారుల సేవా కేంద్రాలు, నూతన కనెక్షన్, అదనపు లోడు పేరు, క్యాటగిరీ మార్పు అన్ని సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నది. మానవ ప్రమేయం లేకుండా బిల్లింగ్, మొబైల్ యాప్‌లు, సాస (ఎస్ఏఎస్ఏ), ఆన్‌లైన్ చెల్లింపులు వివిధ మార్గాల ద్వారా సులభమైన పద్ధతుల్లో, సెల్ఫ్ మీటర్ రీడింగ్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్, కన్స్యూమర్ కాల్ సెంటర్, సీజీఆర్ఎఫ్ పోర్టల్ ఇలా ఎన్నో పద్ధతుల ద్వారా వినియోగదారులకు సత్వరమైన సేవలందిస్తున్నది. అంతేకాకుండా.. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు నెలకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, నాయీబ్రాహ్మణ, రజక వృత్తుల వారికి నెలకు 250 యూనిట్లను సబ్సిడీలో అందిస్తున్నది. వినియోగదారుడి చెంతకు కరెంటు చేరుకునేలోగా ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డిలతో పాటు అహర్నిశలు అజ్ఞాతంగా పనిచేసే వ్యవస్థలు, ఉద్యోగులు చాలామందే ఉంటారు. ఎస్‌సీఏడీఏ, సీబీడీ సెంట్రల్ బ్రేక్‌డౌన్ టీంలు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది, హెచ్‌టీ లైన్లలో పనిచేసే సిబ్బంది, లోడ్ మానిటరింగ్ సెల్ ట్రాన్స్‌ఫార్మర్లు రిపేరింగ్ చేసేవారు, మాస్టర్ ప్లాన్, కన్‌స్ట్రక్షన్ వింగ్, ప్రొటెక్షన్ వింగ్ ఇలా ఎంతోమంది కష్టాల ఫలితంగా నిర్మితమైందే నేటి 24/7 గంటల కరెంటు వ్యవస్థ.

# తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న రేపటి పౌరులు

## విద్యార్థుల ఆత్మహత్యలు నివారించలేమా..?




గత కొన్ని రోజులుగా, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం వార్తలు, కథనాలు ప్రధాన స్రవంతి మీడియాలో సాధారణమైనాయి. మెడికల్ కాలేజీలు, ఐఐటీల వంటి ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌లు, ప్రైవేట్ కాలేజీల నుంచి ఇలాంటి సంఘటనలు నమోదవుతున్నాయి. విద్యాపరమైన ఒత్తిడిని, అధ్యాపకులు, సిబ్బంది, ఇతర విద్యార్థుల వేధింపులు, పరీక్షలలో పేలవమైన పనితీరు వంటివి విద్యార్థులు ఉద్దేశపూర్వకంగా తమ జీవితాలను ముగించడానికి కారణాలు. భారతదేశంలో ప్రపంచవ్యాప్తంగా యువత మరణాలకు ఆత్మహత్యలు ప్రధానంగా ఉంటున్నది. యువత తీవ్ర మానసిక సామాజిక ప్రభావాలను కలిగి ఉందని మానసిక శాస్త్రవేత్తలు అధ్యయనాలు చెబుతున్నాయి, ఇది ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, అసంఘటిత రంగంలోని కార్మికులు ఎక్కువగా ఉన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో భారతదేశంలో ప్రమాద మరణాలు ఆత్మహత్యలు నివేదికలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత పోలీసు విభాగాలు సేకరించిన డేటా ఆధారంగా దేశంలోని ఆత్మహత్యలపై సమగ్ర డేటా ఉంది. ఏడిఎస్ఐ నివేదిక ప్రకారం, 2017 నుంచి భారతదేశంలో ఆత్మహత్యల సంఖ్య ఆత్మహత్యల రేటు గణనీయంగా పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్ ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను ప్రకటించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పదకొండు మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ట్రిపుల్ ఐటి బాసర లో రెండు రోజులల్లో ఇద్దరు విద్యార్థులు చనిపోయారు, బాచుపల్లి నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. భారతదేశంలోని ప్రముఖ కళాశాలల్లో ఆత్మహత్యలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లోని వివిధ క్యాంపస్‌లలో ఈ ఏడాది ఎనిమిది విద్యార్థులు అనుమానాస్పద ఆత్మహత్యల్లో మరణించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో భారతదేశంలోని ప్రమాద మరణాలు ఆత్మహత్యలు నివేదిక ప్రకారం, భారతదేశంలో 2021లో 13,000 మంది విద్యార్థులు ప్రతిరోజూ 35 కంటే ఎక్కువ మంది చనిపోయారు, 2020లో 12,526 మరణాల నుండి 4.5 శాతం పెరిగింది. 10,732 ఆత్మహత్యలలో 864 "పరీక్షల్లో వైఫల్యం" కారణంగా ఉన్నాయి. 2021లో విద్యార్థుల ఆత్మహత్యల మరణాల సంఖ్య 4.5 శాతం పెరిగిందని ఎన్ఆర్సిబి తాజా డేటా చూపిస్తుంది. రీజినల్ చైల్డ్ అండ్ అడల్ట్ ఇన్నిట్యూట్ డాక్టర్లు తమ నివేదికలో మానసిక ఆరోగ్య సమస్యలకు సంబంధించిన కళంకం ఉందని తెలియచేస్తున్నారు. చాలా సార్లు వ్యక్తులు వృత్తిపరమైన సహాయాన్ని సంప్రదించలేరు. కాబట్టి, అటువంటి దృష్టాంతంలో ప్రభుత్వ హెల్ప్‌లైన్‌లు స్వచ్ఛంద సంస్థలు హెల్ప్‌లైన్‌లు చాలా సహాయకారిగా ఉన్నాయి. అవి పూర్తిగా ఉచితం సులభంగా యాక్సెస్ చేయగలవు పిల్లలు ఈ ఎమర్జెన్సీ నంబర్‌లను నోట్‌లో ఉంచుకోవచ్చు. ఆత్మహత్యల నివారణకు స్వచ్ఛంద సేవ సంస్థలు సంజీవని స్నేహ ఉన్నాయి, వారి వెబ్‌సైట్‌లో సరైన సమయాలు భాషలు ఉన్నాయి. మానసిక ఒత్తిడి భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి చాలా వ్యూహాలు ఉన్నాయి. ఒత్తిడిని కలిగించే విషయాలను గుర్తుంచుకుంటే సరైన మార్గాలను కనుగొనవచ్చు, సరైన కోపింగ్ మెకానిజమ్‌లను గుర్తించడం. ఆరోగ్యకరమైన నిద్ర చక్రం చాలా ముఖ్యమైన విషయం. అధిక ఒత్తిడి ఆందోళన వ్యవహరించడంతో సహాయపడే అనేక గ్రౌండింగ్ వ్యాయామాలు ఉన్నాయి,

యువతలో మరణానికి నాల్గవ ప్రధాన కారణం అయిన ఆత్మహత్యలు దేశంలో ఆందోళనకరమైన సమస్యగా తయారయింది, 65 శాతం మంది ప్రజలు 35 ఏళ్ల లోపు ఉన్నారు. ఇది మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటి. ఆత్మహత్యల నివారణ పై జాతీయ విధానం అనేది సాధారణంగా ఆరోగ్యం, ముఖ్యంగా మానసిక ఆరోగ్యం పట్ల భారతదేశం యొక్క నిబద్ధతను నెరవేర్చడానికి అలాగే ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి ఒక అత్యవసరమైన చర్య. ఆత్మహత్య ప్రమాదాన్ని పెంచే కారకాలు ఏమిటి?

విద్యాపరమైన ఒత్తిడి: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సమాజం నుండి అధిక అంచనాలు అధిక ఒత్తిడికి పరీక్షలలో బాగా రాణించాలనే ఒత్తిడికి దారితీస్తాయి. విజయం సాధించాలనే ఈ ఒత్తిడి కొంతమంది విద్యార్థులకు విపరీతంగా ఉంటుంది, ఇది వైఫల్యం మరియు నిస్సహాయ భావాలకు దారితీస్తుంది. డిప్రెషన్, యాంగ్జయిటీ, బైపోలార్ డిజార్డర్ వంటి మానసిక ఆరోగ్య సమస్యలు విద్యార్థుల ఆత్మహత్యలకు దోహదం చేస్తాయి. ఒత్తిడి, ఒంటరితనం మద్దతు లేకపోవడం వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రమవుతాయి. ఎడ్యుకేషనల్ హబ్‌లలో ఉన్న చాలా మంది విద్యార్థులు చాలా దూరం నుండి వచ్చి వారి కుటుంబాలు స్నేహితులకు దూరంగా నివసిస్తున్నారు. ఇది ఒంటరితనం, ఒంటరితనం యొక్క భావాలకు దారి తీస్తుంది, ఇది తెలియని పోటీ వాతావరణంలో ఎదుర్కోవడం చాలా కష్టం. ఆర్థిక ఆందోళనలు: ట్యూషన్ ఫీజులు లేదా జీవన వ్యయాలను భరించలేకపోవడం వంటి ఆర్థిక ఇబ్బందులు విద్యార్థులకు తీవ్ర ఒత్తిడిని ఆందోళనను కలిగిస్తాయి. ఇది నిస్సహాయత మరియు నిరాశ భావాలకు దారి తీస్తుంది. ఆన్‌లైన్ వేధింపులు సర్వసాధారణంగా మారుతున్నాయి విద్యార్థుల ఆత్మహత్యలకు దోహదం చేస్తాయి. సైబర్ బెదిరింపు వేధింపులు, సైబర్‌స్టాకింగ్ లేదా సోషల్ మీడియా ద్వారా బెదిరింపు వంటి అనేక రూపాలను తీసుకోవచ్చు. పదార్థ దుర్వినియోగం: మత్తుపదార్థాల దుర్వినియోగం, మద్యం దుర్వినియోగం విద్యార్థుల ఆత్మహత్యలకు దోహదపడతాయి. పదార్థ దుర్వినియోగం మానసిక ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు చట్టపరమైన సమస్యలకు దారి తీస్తుంది, ఇవన్నీ విద్యార్థులకు విపరీతంగా ఉంటాయి.

సంబంధ సమస్యలు: బంధుత్వ సమస్యలు, విడిపోవడం, కుటుంబ కలహాలు స్నేహ సమస్యలు కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు దోహదం చేస్తాయి. ఇంటి నుండి దూరంగా ఉన్న పరిమిత మద్దతు ఉన్న విద్యార్థులకు ఈ సమస్యలను ఎదుర్కోవడం చాలా కష్టం. మద్దతు లేకపోవడం: ఎడ్యుకేషనల్ హబ్‌లలోని చాలా మంది విద్యార్థులు కష్టపడుతున్నప్పుడు సహాయం కోసం చేరుకోవడానికి ఇష్టపడరు. ఈ మద్దతు లేకపోవడం నిస్సహాయత నిరాశ భావాలకు దారి తీస్తుంది.

ఆత్మహత్యలను నివారించడానికి ఏమి చేయాలి?

మానసిక ఆరోగ్య సేవలు మరియు కౌన్సెలింగ్ సేవలు, సహాయక బృందాలు మనోవిక్షేప సేవలు వంటి వనరులను విద్యార్థులకు అందించడం ఆత్మహత్యలను నిరోధించడంలో సహాయపడుతుంది. అలాగే, పాఠశాలలు విశ్వవిద్యాలయాలు తప్పనిసరిగా ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు మానసిక ఆరోగ్య ప్రథమ చికిత్సలో శిక్షణ ఇవ్వాలి. మానసిక ఆరోగ్యం పట్ల సానుకూల దృక్పథాన్ని స్వీకరించడం:

మానసిక ఆరోగ్యం ఆత్మహత్యల గురించి బహిరంగ చర్చల ద్వారా మానసిక ఆరోగ్యం సహాయం కోరడం పట్ల సానుకూల దృక్పథాలను కూడా ప్రోత్సహించాలి.

వ్యక్తిత్వ వికాసానికి సమగ్ర విధానాన్ని తీసుకోవడం ద్వారా, విద్యాసంస్థలు విద్యార్థులు విద్యాపరంగా మానసికంగా అభివృద్ధి చెందడానికి సహాయపడే సహాయక మరియు సమగ్ర వాతావరణాన్ని సృష్టించగలవు ఆత్మహత్యలను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒత్తిడి భావోద్వేగాలకు సానుకూల అవుట్‌లెట్ అందించడం ద్వారా విద్యా కేంద్రాలలో ఆత్మహత్యలను నివారించడంలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయి, అలాగే ఆత్మగౌరవం విశ్వాసాన్ని పెంచుతాయి. విద్యార్థుల మొత్తం శ్రేయస్సును మెరుగుపరచడానికి ఒత్తిడి, ఆందోళన నిరాశను తగ్గించడానికి పేదరికం, నిరాశ్రయం మరియు నిరుద్యోగం వంటి సామాజిక-ఆర్థిక కారకాలను పరిష్కరించాలి. కఠినమైన సైబర్ బెదిరింపు విధానాలను అమలు చేయడం ఆన్‌లైన్ వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవడం విద్యార్థుల ఆత్మహత్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో సోషల్ మీడియా సైట్‌లను పర్యవేక్షించడం, సైబర్ బెదిరింపులకు సంబంధించిన విద్యను అందించడం సైబర్ బెదిరింపు లకు వ్యతిరేకంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటివి ఉండవచ్చు. మాదకద్రవ్యాల దుర్వినియోగం నిరోధక కార్యక్రమాలను అమలు చేయడం వల్ల విద్యార్థుల ఆత్మహత్యల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. మాదకద్రవ్య దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం, వ్యసనంతో పోరాడుతున్న వారికి మద్దతు అందించడం డ్రగ్స్ ఆల్కహాల్‌కు ప్రాప్యతను తగ్గించడానికి చర్యలు తీసుకోవడం వంటివి ఇందులో ఉండవచ్చు. సానుకూల సంబంధాలు మరియు కనెక్షన్‌లను నిర్మించుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించడం, రిలేషన్షిప్ కౌన్సిలింగ్ సేవలను అందించడం సహాయం కోసం విద్యార్థులను ప్రోత్సహించడం ఆత్మహత్య ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. విద్యార్థులకు వారి కుటుంబాల నుంచి మద్దతు అందించడం ఆత్మహత్య ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కుటుంబాలకు మద్దతుగా వనరులను అందించడం వారి కుటుంబాలతో సంబంధాన్ని కొనసాగించడానికి విద్యార్థులను ప్రోత్సహించడం వంటివి కలిగి ఉండవచ్చు.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు,**
**అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక**

## నీరు మన జీవనాధారం

క్యారెల్‌కు నాలుగు బిందెలు కట్టుకొని
పోరడు కస్తీగా సైకిల్ తొక్కంగ
సొమ్మసిల్లిన చైన్ కక్ష్య దాటిన చప్పుడు
బతుకు లంకెను పణం చేసింది
వాలిపోయిన భుజాల
వట్టి పోయిన ఆశలు
నడుం బొక్కలరిగి
వాకిలి కూలిన అక్క చెల్లెలు
వెన్ను వంగిన అమ్మా నాయ్నలనేమని
పలకరిస్తరు ?
దశాబ్దాలు దశాబ్దాలుగా
ఈ ఎడారుల సంచారంలో
వచ్చిపోయే నీటి భ్రమల కోసం
కాలుతున్న గచ్చు మీదా
కందెనింకిన గిరక మీదా
కాళ్లు తడవని నేలమీదా
ఆనని బొక్కెన వెక్కిరింపులు
సహించలేదా !
పుట్టుకకు చావుకూ
ముందే పుట్టిన ఈ నీటి బొట్టు
ఎవరి దురదృష్టమవుతున్నదని !
కలవరిస్తున్న నీటికన్ను నిప్పుల జ్వాల
తెగింపు భగీరథుని వాగ్దానం చేసింది
పరితపించే తాపసులకే ఎరుక
కూకటి వేరు గుబురులోకి పోయి
నీటి తుట్టెను కదిలించటం ఎట్లనో
ప్రవాహాన్ని మళ్లించడం ఎట్లనో
పారే నరాలను అనుసంధానం చేయటం
ఎట్లనో
పరితపించే తాపసులకే ఎరుక
కాలుష్యం చుక్కరాలని
ఊసుల కన్నులకు ఊరడింపు ఎట్లనో
పొక్కిలైన వాకిలిని
తలవంచిన మేఘాన్ని
వెన్నెలనుజి
పిలుచుకోవాలెట్లనో



ఎదురు చూపుల ఆత్రానికి
కడగండ్లు కడిగే మిషన్
కదన రంగాన కాలు దువ్వుకుంటూ
పరవళ్లు తొక్కుతున్నది
బతుకు ప్రధాన జీవనాధారం నీరు
ఉపరానంత ఆశలకు ప్రాణం పోస్తూ
వాకిట ఉదయిస్తున్నది
ఏ సూక్ష్మ కణాన్ని శోధించు
మళ్లి పోయిన ఊటలన్నీ ఒకటొకటిగా
బతుకు జలాశయంలోకి చేరుకుంటున్న
జీవ నదుల సవ్వడులే
ఉప్పొడి పులకిస్తున్న
ఆనందాల బాష్పధారలే
రెండు కొలుకుల రెప్పల నిండా
తెలంగాణమంత
హరివిల్లులై పూచే పూలదండలే.

**బెల్లంకొండ సంపత్ కుమార్**

## ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ అధికార ప్రతినిధిగా చిరువ సుమన్ శర్మ



మేడిపల్లి, జూన్16 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉప్పల్ నియోజకవర్గం బీజేపీ అధికారప్రతినిధిగా ఉప్పల్ కు చెందిన చిరువ సుమన్ శర్మ నియమితులయ్యారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్విఎస్ఎస్ ప్రభాకర్ ఆదేశాల మేరకు ఉప్పల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ దేవసాని బాలచందర్ నియామక పత్రాన్ని సుమన్ శర్మకు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ శర్మ మాట్లాడుతూ బీజేపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకపోతూ బీజేపీ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు పాటుపడతానని తెలిపారు. తన పై నమ్మకంతో ఈ పదవిలో నియమించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కు,ఎన్విఎస్ఎస్ ప్రభాకర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు హరీష్, దేవసాని బాలచందర్, బీజేపీ సీనియర్ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోనె శ్రీకాంత్ ముదిరాజ్, గోపాల్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## కళాశాలల్లో హరితోత్సవం, విద్యా దినోత్సవం నిర్వహించాలి: డిఐఈఓ శ్రీధర్ సుమన్



ఆసిఫాబాద్ జిల్లా జూన్16 (ప్రజాపాలన,ప్రతినిధి) : ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేటు కళాశాలల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న హరితోత్సవం, 20న విద్యా దినోత్సవం, నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీధర్ సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని కళాశాలల్లోని ప్రిన్సిపాళ్లు, ఎన్,ఎస్,ఎస్, యూనిట్ల ప్రోగ్రాం అధికారులు 19న హరితోత్సవం నిర్వహించాలని అన్నారు. హరితోత్సవంలో భాగంగా ప్రతి కళాశాలల్లో మొక్కలు నాటి నీరందించే బృహత్ కార్యక్రమంలో అందరూ విద్యార్థులు పాల్గొనాలన్నారు. 20న విద్యా దినోత్సవం లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, వార్షిక పరీక్షలో టాపర్లకు బహుమతులు అందజేయాలన్నారు. ఈ ఉత్సవాలను పండుగలా ఘనంగా నిర్వహించి, అధికారులకు తగు నివేదిక పంపించాలని సూచించారు.

## ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



మంచిర్యాల బ్యూరో, నిర్మల్, జూన్ 16, ప్రజాపాలన: నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.34.43 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్ కు అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి , జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి లతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై ఆర్టీసీ దృష్టి సారించిందని, ఇందులో భాగంగా నిర్మల్ బస్టాండ్ ఖాళీ స్థలంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత అవసరాలకనుగుణంగా 1.3 ఎకరాలలో 43 వేల స్క్వేర్ ఫీట్ల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో మెరుగైన సౌకర్యాలతో కమర్షియల్ కాంప్లెక్సను నిర్మిస్తున్నామన్నారు. ఈ కమర్షియల్ కాంప్లెక్స్ లో పార్కింగ్ సదుపాయం కోసం సెల్లార్, జి ప్లస్ త్రీ నిర్మాణంలో 53 స్టాళ్లను, శుభకార్యాలు నిర్వహించేందుకు కూడా ప్రత్యేక హాలును నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్స్, ఇతర సౌకర్యాలతో పాటు ఎల్సిడి తెరలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నిర్మల్ బస్టండ్ ప్రక్క నుంచి ప్రియదర్శిని నగర్ వేళ్లే రోడ్ ను పరిశీలించారు. ఇరుకైన రహదారితో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని 40 ఫీట్ల సీసీ రోడ్ విస్తరణకు ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

## నీట్ యూజీసీ ఫలితాలలో మంచిర్యాల విద్యార్థి కి 62వ ర్యాంకు



మంచిర్యాల టౌన్, జూన్ 16, ప్రజాపాలన: నీట్ యూజీసీ 2023 ఫలితాలలో మంచిర్యాలకు చెందిన విద్యార్థి వివేక్ వర్ధన్ 673/720 మార్కులు సాధించి రిజర్వేషన్ కేటగిరీలో 62 వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచిన అతను హైదరాబాద్ హైదర్ నగర్ లోని శ్రీ చైతన్య కళాశాలలో చదువుతూ ర్యాంకు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చౌదరి వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ లు విద్యార్థిని ఘనంగా సత్కరించి అభినందించారు.

# ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం వేడుకలు




మధిర జూన్ 16 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నాడు తెలంగాణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈరోజు రెడ్డి గార్డెన్ లో జరిగిన పట్టణ ప్రగతి దినోత్సవం లో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు ఎమ్మెల్సీ కొండబాల కోటేశ్వరరావు మున్సిపల్ చైర్మన్ మోడీతో కలత జయకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజల చేసి జాతీయ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల హయాంలో గ్రామపంచాయతీకి ఎన్నికల కూడా దొరకలేదు. 2005 నుండి 13 వరకు కేవలం 18 లక్షలతోనే మధిర గ్రామ పంచాయతీలో ఆనాటి పాలకవర్గం అభివృద్ధి పనులు చేపట్టినారు.చైర్పర్సన్ మొండితోక లతా ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో మధిర అభివృద్ధి సాధించింది మంత్రులు కేటీఆర్, అజయ్ కుమార్ సహకారంతో 150 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.మధిరలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నాం మధిర అభివృద్ధిలో నామా పాత్ర ఉంది.స్థానిక ఎమ్మెల్యే సహకారం లేకుండానే మంత్రుల కేటీఆర్, అజయ్, ఎంపీ నామ, కొండబాల సహకారంతో మధిరని అభివృద్ధి చేశాం.సఫాయి కార్మికుల సేవలను గుర్తించి ముఖ్యమంత్రి కేసీఆర్ వారి జీతాలు పెంచడం జరిగింది.ఎన్నికల అప్పుడు వచ్చి మాయమాటలు చెప్పే ప్రభుత్వం మాది కాదు రానున్న కాలంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ని మరోసారి ఆశీర్వదించాలి. అనంతరం పార్లమెంట్ సభ్యులు నామ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూతెలంగాణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రగతి దినోత్సవంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలో ముమ్మరంగా అభివృద్ధి సంక్షేమ పనులు కొనసాగుతున్నాయిమిషన్ భగీరథ ద్వారా సాగునీరు సమస్యను పరిష్కరించాము టిఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో కరెంటు సమస్యలేదు, త్రాగునీరు సమస్య లేదుపెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్న కేసీఆర్ కి అండగా ఉండాలి మధిర లో ట్యాంకు బండ చాలా బాగుంది.

అనంతరం ప్రజా ప్రతినిధులు నాయకులు కౌన్సిలర్లు తోమున్సిపాలిటీ సిబ్బందితో కార్మికులతో భారీ ఎత్తున ర్యాలీ తీసి భారీ ఎత్తున ప్రజలు పాల్గొని దిగ్విజయం చేశారని మున్సిపల్ ఛైర్మన్ మొండితోక లతా జయకర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమం పట్టణ పరిధిలో భాగంగా ప్రజలు ప్రజలు ప్రజా ప్రతినిధులు కౌన్సిలర్లు సిబ్బందితో సహాయ సహకారాలతో విజయవంతమైనదని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎడిషనల్ కలెక్టర్ స్నేహలత మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగశెట్టి కోటేశ్వరరావు మండల పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరావు వెంకటేశ్వరరావు కరివేదల సుధాకర్ బక్కీ కష్టప్రసాద్ వంకాయలపాటీ నాగేశ్వరావుఆత్మ కమిటీ చైర్మన్ రామారావు చావా రామకృష్ణనలుమూల వెంకటేశ్వర్లు చావా వేణు వార్డ్ కౌన్సిలర్లు వైస్ చైర్మన్ విద్యాలత వెంకటరెడ్డి అప్పారావు మేడికొండ కళ్యాణి కిరణ్ మాధవి లక్ష్మి మాధురి బొమ్మర రామ్మూర్తి మల్లాది వాసు పలువురు నాయకులు ప్రజా ప్రతినిధులు ఏ ఈ నరేష్ రెడ్డి కమిషనర్ మున్సిపల్ రమాదేవి మేనేజర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# వికలాంగులకు వెంటనే యు డి ఐ డి కార్డులు పంపిణీ చేయాలి




ఇబ్రహింపట్నం జూన్ తేది 16 ప్రజాపాలన ప్రతినిధి :దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలకు యూనిక్ డిజేబులిటీ ఐడి కార్డు తప్పనిసరి చేయాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయాలంటే 2023-24 ఆర్థిక సంవత్సరం నుండి యుడిఐడి మరియు రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన వైకల్యం ధృవీకరణ పత్రంతో పాటు కేంద్రం జారీ చేసిన ప్రత్యేక వికలాంగ గుర్తింపు సంఖ్య లేదా ఎన్రోల్మెంట్ నంబర్ను తప్పనిసరి చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ వికలాంగుల సాధికారత విభాగం దాని అనుబంధ సంస్థలు అందించే విద్యార్థులకు స్కాలర్షిప్ల వంటి పథకాల ప్రయోజనాలను పొందేందుకు UDID కార్డ్ తప్పనిసరి చేయాలని నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నది.17 రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను తీసుకువస్తున్నమనే పేరుతో యు డి ఐ డి కార్డులు తప్పనిసరి చేయడం సరైంది కాదు. నేషనల్ ట్రస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మరియు అన్ని నేషనల్ ఇన్స్టిట్యూట్ల ద్వారా అందుతున్న సేవలకు యు డి ఐ డి అనివార్యమని ప్రకటించడం అంటే వికలాంగులకు పథకాలను అందకుండా చేయడమే తప్ప మరొకటి కాదు. వైకల్యం యొక్క రకం మరియు వైకల్యం శాతం ఆధారంగా దేశవ్యాప్తంగా చెల్లుబాటు అయ్యే విధంగా యు డి ఐ డి కార్డులు జారీ చేయాలని 2016లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 17 పథకాల జాబితాలో వైకల్యాలున్న విద్యార్థుల కోసం ప్రీ- మరియు పోస్ట్-మెట్రిక్ స్కాలర్షిప్ వంటి వివిధ స్కాలర్షిప్ మరియు ఉపకరణాల కొనుగోలు, ఉపకరణాలు అమర్చడం కోసం వికలాంగులకు సహాయం, జాతీయ సంస్థలలో చికిత్స,నేషనల్ ట్రస్ట్ కింద డే కేర్ మరియు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్ వంటివి పొందేందుకు యూ డి ఐ డి కార్డు తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తుంది. ఇప్పటికే పంపిణీ చేసిన యు డి ఐ డి కార్డులు చెల్లుబాటు అయ్యే విధంగాకేంద్ర మరియు రాష్ట్రా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంపిణీ చేసిన కార్డులు ఉపయోగంలోకి రాకుండానే ప్రభుత్వ పథకాలు పొందాలంటే యు డి ఐ డి కార్డు తప్పనిసరి అని చెప్పడం ప్రభుత్వాల అవగాహన రాహిత్యానికి నిదర్శనం. యూ డి ఐ డి కార్డ వికలాంగులకు ఇవ్వాలని దశాబ్ద కాలంగా ఎన్ పి ఆర్ డి ఉద్యమాలు చేసింది. ఉద్యమాల ఫలితంగా యు డి ఐ డి కార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేశంలో వికలాంగులు అందరు యు డి ఐ డి కార్డు కల్గి ఉండడం మంచి నిర్ణయమే అయినప్పటికీ కార్డును వికలాంగులపై బలవంతంగా రుద్దాలని చూడడం సరైంది కాదని ఎన్ పి ఆర్ డి డివిస్తుంది.2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం 2.68 కోట్ల మంది వికలాంగుల జనాభాలో, జనవరి 2022 నాటికి దాదాపు 1.74 కోట్ల మందికి వైకల్య ధృవీకరణ పత్రాలను జారీ చేసినట్లు 2021-22 నాటి కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, వికలాంగుల సాధికారత మంత్రిత్వ శాఖ వార్షిక నివేదికనులో పేర్కొన్నారు. దేశంలో ఇప్పటివరకు సుమారు 90.70 లక్షల మంది వికలాంగులకు యు డి ఐ డి కార్డులు పంపిణీ చేశామని, రాష్ట్ర స్థాయిలో ఐదు లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికీ దేశ వ్యాప్తంగా వికలాంగులందరికీ వైకల్యం ధృవీకరణ పత్రాలు లేవు. వారందరికీ నిర్దిష్ట గడువులోపు వైకల్యం ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తుంది. వైకల్యం ధృవీకరణ పత్రాలు లేకుండా యు టి ఐ డి కార్డులు మంజూరు చేయడం ఆచరణ సాధ్యం కాదనే విషయం ప్రభుత్వం గుర్తించాలి. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైకల్యం ధృవీకరణ పత్రాలతో పాటు యు డి ఐ డి కార్డులు పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎన్పిర్డి కోరుతుంది.

## కనీస వేతనాలు చెల్లించాలి



మంచిర్యాల టౌన్, జూన్ 16, ప్రజాపాలన : కనీస వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ సి ఐ టి యు ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏవో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ మొత్తం జిల్లాలో ఐదు వేసా మార్కెట్ కమిటీలు ఉన్నాయి అందులో 19 మంది సెక్యూరిటీ గార్డ్ లు గత 28 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ద్వారా మార్కెట్ యార్డులలో చెక్ పోస్టులలో పని చేస్తున్న వారికి సదరు ఏజెన్సీలు సక్రమంగా ఫి ఎఫ్ ఈఎస్ఐ చెల్లించడం లేదని దీని వలన రావలసిన ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు సెక్యూరిటీ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా మార్కెట్ కమిటీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కనీస వేతనాల జివో 21 ప్రకారం దానిని గెజిట్ చేసి అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పి. రమేష్ గూడా వెంకటస్వామి వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వై. రమేష్ జిల్లా కోశాధికారి స్వప్న వందన కే. జనార్దన్ వి.వెంకన్న ఎస్. సతీష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఉత్తమ సేవలకు ప్రశంషా పత్రాలు అందజేత



మేడిపల్లి, జూన్16 (ప్రజాపాలన ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం పారిశుధ్య కార్మికులు,మున్సిపల్ వాహనాలతో కలిసి ర్యాలీగా బయలుదేరి ప్రధాన రహదారి వెంట సఫాయి కార్మికుల గొప్పదనాన్ని తెలియజేశారు.సెట్విన్ సెంటర్ యందు ఏర్పాటు చేసిన ప్రగతి నివేదిక సమావేశం"సఫాయన్న నీకు సలాం,సఫాయమ్మ నీకు సలాం" కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ గుర్తు ఆకారంలో మానవ హారం ఏర్పాటు చేసి జై తెలంగాణ నినాదలు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి దాకా జరిగిన అభివృద్ధిని వివరించిన అనంతరం మున్సిపల్ కార్మికులకు పిపిఈ కిట్లు మరియు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మహిళ సంఘాల, విద్య, వైద్య, మంచి నీటి రంగాల్లో ఉత్తమ సేవలకు ప్రశంషా పత్రాలు మేయర్ జక్క వెంకట్ రెడ్డి,కమిషనర్ వంశీక్రిష్ణ,25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి,మరియు కార్పొరేటర్ల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ఏర్పాటు చేసిన సంపహక్తి విందులో పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్యులు,మున్సిపల్ మేనేజర్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డివిజన్లో వార్డు కార్యాలయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మేయర్ విజయలక్ష్మి కార్పొరేటర్లు



మేడిపల్లి, జూన్16 (ప్రజాపాలన ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు దిశ నిర్దేశం ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ లోని అన్ని డివిజన్లో వార్డుల పాలన వ్యవస్థకు శ్రీకారం చుట్టి, పౌర సేవలు మరింత మెరుగుపరిచి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సులభధరం చేసే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వార్డు కార్యాలయాలకు శ్రీకారం చుట్టి ప్రతి వార్డు కార్యాలయంలో పదిమంది వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను అతి త్వరగా పరిష్కరించేందుకు కృషిలో భాగంగా ఉప్పల్, హబ్సిగూడ డివిజన్లలో వార్డు కార్యాలయాలను స్థానిక కార్పొరేటర్లు రజిత పరమేశ్వర్ రెడ్డి, చేతన హరీష్ లతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ప్రారంభించారు. రామంతాపూర్ డివిజన్లో స్థానిక కార్పొరేటర్ బండారి శ్రీవాణి వెంకట్రావులతో కలిసి హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రారంభించారు. చిల్కానగర్ డివిజన్లో స్థానిక కార్పొరేటర్ గీత ప్రవీణ్ ముదిరాజ్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రసాదరావు, ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డీ. ఈ. నిఖిల్ రెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, డివిజనల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి, మేనేజర్ సత్య నారాయణ, వివిధ శాఖల అధికారులు, బిఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గరిక సుధాకర్ , గడ్డం రవికుమార్, వేముల సంతోష్ రెడ్డి, మేకల మధుసూదన్ రెడ్డి , చింతల నరసింహారెడ్డి , మస్క సుధాకర్, పంగ మహేందర్ రెడ్డి,నయాబు వెంకట్రావు, అరటికాయల వంశీ కమటాల మల్లేష్, బాడే అంజయ్య, సాతెల్లి మల్లేష్, రాణి రెడ్డి, అనిత రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది , మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# టీ కాంగ్రెస్ లో షర్మిల తుఫాను



హైదరాబాద్, జూన్ 16,:తెలంగాణ రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి. కొత్త ఎత్తులు, కొత్త పొత్తులు తెరపై కొస్తున్నాయి. సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయంతో లెక్కలు మారిపోయాయి. అంత వరకు తెలంగాణ రాజకీయాల్లో మూడవ స్థానంలో ఉందని అనుకున్న హస్తం పార్టీని విశ్లేషకులు పై మెట్టుకు తీసుకుపోయారు. బీజేపీని మూడవ స్థానంలోకి నెట్టేశారు. అదే సమయంలో బీజేపీలో అంతవరకు కొంత గుంభనంగా ఉన్న అంతర్గత విభేదాలు, ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అలకలు,లుకలుకలు బయట కొచ్చాయి. అన్నిటికంటే ముఖ్యంగా పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మధ్య పార్టీ నేతలు గీతలు గీసుకున్నారు. రెండుగా విడిపోయారు. రహస్య భేటీలు, నాయకుల ఢిల్లీ యత్రాలతో మీడియా కథనాలు, మేథావుల విశ్లేషణలతో బీజేపీ ఇమేజ్ డ్యామేజైంది. దీనికి తోడు గత నాలుగైదు నెలలకు పైగా, ఇటా అటా అని ఊగిసలడుతున్న బీఆర్ఎస్ బహిష్కృత నాయకులు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి శ్రీనివాస రావు చివరకు హస్తంతో చేతులు కలిపేందుకు సిద్ధమవడంతో కాంగ్రెస్ పార్టీ ఇమేజ్ ఇంకొంత పెరిగింది. బండిని మార్చేది లేదని బీజేపీ నేతలు స్పష్టం చేసినా రాష్ట్రకార్యవర్గాన్ని విస్తరించినా, ఫలితం కనిపించడం లేదు. అయితే కర్ణాటక విజయంతో మంచి ఊపు మీదున్న కాంగ్రెస్ పార్టీలో అంతా బాగుందా? విభేదాలు తొలిగి పోయాయా? అంటే లేదనే సమాధానమే వస్తోంది. నిజానికి, కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం కనిపిస్తున్న ప్రశాంతత తుపాను ముందు ప్రశాంతత మాత్రమే, అనే మాటలు వినిపిస్తున్నాయి. కర్ణాటక ఫలితాలు తెలంగాణ కాంగ్రెస్ లో జోష్ ను పెంచాయి కానీ అదే సమయంలో తెలంగాణ పార్టీ వ్యవహారాల్లో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమేయం పెరగడం టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వర్గాన్ని ఆందోళనకు గురిచేస్తోందని అంటున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు దివంగత కాంగ్రెస్ నాయకుడు వైఎస్సార్ కుమార్తె వైఎస్ షర్మిల తమ పార్టీని ని కాంగ్రెస్ లో విలీనం చేస్తున్నారని వస్తున్న వార్తలు పార్టీలో దుమారం రేపుతున్నాయి. నిజానికి కర్ణాటక ఎన్నికలకు ముందు బీజేపీలో కనిపించిన ప్రశాంతతే ఇప్పుడు కాంగ్రెస్ లో కనిపిస్తోందని అంటున్నారు.షర్మిల విషయంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వ్యక్తం చేసిన అభ్యంతరం పార్టీలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కాగా కర్ణాటక ఫలితాలు వెలువడిన వెంటంటే షర్మిల బెంగుళూరు వెళ్ళారు. డీకే శివకుమార్ ను కలిసి అభినందనలు తెలిపారు. అలాగే అది జరిగిన వారం పదిరోజుల వ్యవధిలో ఆమె మరో మారు బెంగుళూరు వెళ్లి డీకే శివకుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఇక అక్కడి నుంచి షర్మిల వైఎస్సార్ ? టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తున్నారని టీపీసీసీ పగ్గాలు చేపట్టనున్నారనే ప్రచారం మొదలైంది. అయితే ఆమె ఆ వార్తలను ఖండిచారు. అయినా షర్మిల విషయంలో కాంగ్రెస్ పార్టీలో గందరగోళం కొనసాగుతూనే వుంది. ఆమెను పార్టీలోకి ఆహ్వానించే విషయంలో అభిప్రాయ బేధాలు భగ్గుమంటున్నాయి.వైఎస్సార్ తో కలిసి పనిచేసిన సీనియర్ నాయకులు షర్మిలకు స్వాగతం పలుకుతున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరితే స్వాగతిస్తామని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ప్రకటించారు. మరోవైపు డీకే శివకుమార్ ద్వారా రేవంత్ రెడ్డికి చెక్ పెట్టేందుకు షర్మిలను అస్త్రంగా ప్రయోగిస్తున్నారని రేవంత్ రెడ్డి వర్గం ఆరోపిస్తోంది.రేవంత్ రెడ్డి, తాజాగా తాను పీసీసీ అధ్యక్షునిగా ఉన్నంతవరకు తెలంగాణలో షర్మిల రాజకీయాలు సాగనీయనని తేల్చి చెప్పారు.

ఒక విధంగా శపథమే చేశారు. ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నదే ఆంధ్ర పాలన నుంచి విముక్తి కోసం. ఇప్పుడు రాష్ట విభజనకు వ్యతిరేకంగా పనిచేసిన ఆంధ్ర పాలకులను ఎలా పార్టీలో చేర్చుకుంటాం అని ప్రశ్నిస్తున్నారు. ఏపీకి చెందిన షర్మిల వచ్చి తెలంగాణలో నాయకత్వం వహిస్తానంటే ఎలా ఊరుకుంటామంటూ నిప్పులు చెరిగారు. షర్మిల ఏపీ కాంగ్రెస్ కి పని చేస్తే స్వాగతిస్తానంటూ హితవు పలికారు. షర్మిల ఏపీసీసీ చీఫ్గా పని చేస్తే.. సహచర పీసీసీ అధ్యక్షునిగా వెళ్లి ఆమెను మర్యాదపూర్వకంగా కలుస్తానని చెప్పుకొచ్చారు. అంతే కానీ.. తెలంగాణలో ఆమె నాయకత్వంలో పనిచేసేది లేదని కుండబద్దలు కొట్టేశారు. తాను కాంగ్రెస్ లో ఉన్నంత వరకు షర్మిల నాయకత్వం తెలంగాణలో రానివ్వనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.అదలా ఉంటే రాహుల్ గాంధీ, ప్రధానంగా 2024 లోక్ సభ ఎన్నికలపై దృష్టిని కేద్రీకరించినందున, ఈ సవత్సరం చివర్లో తెలంగాణ సహా జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను కాంగ్రెస్ అధిష్టానం ప్రియాంకా వాద్రా అప్పగించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆమె ఇప్పటికే మధ్య ప్రదేశ్ లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. త్వరలో తెలంగాణలోనూ ప్రియాంక పర్యటించనున్నారు. ముఖ్యంగా జూపల్లి, పొంగులేటి సహా మరికొందరు ముఖ్య నాయకుల చేరికలు ఆమె సమక్షంలో అదీ కూడా నల్గొండ వేదికగా జరగనున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీతో ఉన్న సన్నిహిత సంబంధాలతో ఇంతకాలం సీనియర్ నాయకులపై పైచేయి, సాధిస్తూ వచ్చిన రేవంత్ రెడ్డిపై ఇక సీనియర్ నాయకులు పైచేయి సాధించే అవకాశం లేక పోలేదని అంటునారు. అందుకే రేవంత్ రెడ్డి తాను పీసీసీ చీఫ్ గా ఉన్నంత వరకు షర్మిలను గాంధీ భవన్ మెట్లు ఎక్కనీయనని శపథం చేశారని అంటున్నారు.

## సంగారెడ్డి అభివృద్ధి ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే: టీఎస్ హెచ్ డిసి ఛైర్మన్ చింతప్రభాకర్



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: సంగారెడ్డి పట్టణ అభివృద్ధి సమపాళ్లలో జరిగిందని ఆఘనత ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతప్రభాకర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలలో భాగంగా సంగారెడ్డి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి పట్టణంలోని పిఎస్ఆర్ గార్డెన్స్ లో తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం సాధించుకున్న తర్వాత తెలంగాణను అన్ని రంగాలలో దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి దన్నారు. తొమ్మిది సంవత్సరాలలో మంత్రి హరీష్ రావు సహాయ సహకారంతో సంగారెడ్డి మున్సిపాలిటీ అభివృద్ధి జరిగిందని తెలిపారు. పాత పట్టణంలో వర్షం కురిస్తే సగం ముంపునకు గురి అయ్యేది సత్వరమే మంత్రి హరీష్ రావు స్పందించి రూ 7 కోట్ల నిధులు మంజూరు చేయగా డ్రైనేజీ వ్యవస్థ బాగు చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా రోడ్డు విస్తరణ జరగాలని కోరగా రూ 17 కోట్ల నిధులు హెచ్ యం డి ఎ ద్వారా మంజూరు చేశారని, దీనితో సెంట్రల్ మీడియం అభివృద్ధి పనులు జరిగి పట్టణ స్వరూపమే మారి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రూ 50 కోట్ల నిధులు ఇవ్వగా పట్టణంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే దిశగా, అపరిష్కృతంగా ఉన్న పనులు పూర్తి అవుతాఉన్నాయని తెలిపారు. ఇందుకుగాను ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. కొరొనా సమయంలో ప్రజలకు సేవలందించిన మున్సిపల్ సఫాయి కార్మికులను అభినందించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మున్సిపల్ సిబ్బంది, కార్మికులను మేమెంటో, ప్రశంసాపత్రంతో సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి, వైస్ చైర్ పర్సన్ లతా విజయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, జడ్పిటిసిలు, మాజీ సిడిసి చైర్మన్ విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా ఓటర్ సర్వేలో తాహాసిల్దార్ రమణి



బోనకల్, జూన్ 16 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని పెద్ద బీరవెల్లి గ్రామంలో శుక్రవారం ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తహశీల్దార్ రమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయడనీ, డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి తొలగింపునకు దరఖాస్తులను స్వీకరించి సవరణలు చేసి తుది జాబితాను ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అనతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా అందించాలని కోరారు. అదే గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీ నీ సందర్శించి అక్కడ పెరుగుతున్న మొక్కల యొక్క వివరాలూ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి జి కోటేశ్వరావు, అంగన్వాడి టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారుడికి హాస్టల్ లో వసతి కోసం మంత్రి హరీశ్ రావును కలిసిన బండారి లక్ష్మారెడ్డి



మేడిపల్లి, జూన్ 16 (ప్రజాపాలన ప్రతినిధి): రామంతాపూర్ డివిజన్ శ్రీనగర్ కాలనీకి చెందిన ఇ.రమేష్ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారి కుమారుడు అరవింద్ కబడ్డీలో రాణిస్తున్నాడు.గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో హాస్టల్ మరియు ట్రైనింగ్ కోసం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దృష్టికి తీసుకెళ్లి హాస్టల్ మరియు ట్రైనింగ్ కోసం సీటు వచ్చేలా కృషి చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారుని తండ్రి మాకు అన్ని విధాల సహకరించిన బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బోసాని పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రీల్స్‌తో ఫారెస్ట్ బంపర్ ఆఫర్

నిజామాబాద్, జూన్ 16, :రీల్స్ చేసే వారికి ఓ ఆఫర్ ప్రకటించింది తెలంగాణ అటవీ శాఖ. పచ్చదనం ప్రాధాన్యతను వివరిస్తూ రీల్స్ చేసి అవార్డులు గెలుచుకునే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు సంబంధించిన తేదీలను కూడా వెల్లడించింది.మీరు రీల్స్ చేస్తారా...? వీడియోలు.. రీల్స్ చేస్తూ జనాలను ఎంటర్?టైన్ చేస్తుంటారా..? అయితే మీలాంటి వారికి అదిరిపోయే న్యూస్ చెప్పింది తెలంగాణ అటవీశాఖ. దశాబ్ది ఉత్సవాల వేళ... హరితహారం, పచ్చదనం, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ రీల్స్, వీడియోస్ చేసి పంపితే వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి అవార్డులు ఇస్తామని అటవీశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను పేర్కొంది.రాష్ట్ర అవతరణ సందర్భంగా... ఈ ఏడాది దశాబ్ది ఉత్సవాలకు శ్రీకారం చుట్టింది తెలంగాణ సర్కార్. ఇందులో భాగంగా 21 రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అయితే జూన్ 19వ తేదీన హరితోత్సవం నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోజు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే పచ్చదనం ప్రాముఖ్యత, హరితహారాన్ని మరింతగా ప్రోత్సహించడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. నిమిషం నిడివి ఉండేలా రీల్స్, వీడియోలను ఆహ్వానించింది. ఇందులో బెస్ట్ గా ఉండే వాటిని ఎంపిక చేసి అవార్డులను అందజేస్తామని ప్రకటించింది. ఇక నెటిజన్లు చేసే రీల్స్ కానీ వీడియోలను బినెప్ట్రప్త్ర2023ఏణఎజీతిశ్రీ.ఇనీఏ మెయిల్ అడ్రస్ కు పంపాల్సి ఉంటుంది.

**జూన్ 17**

జూన్ 17వ తేదీ శనివారం ''తెలంగాణ గిరిజనోత్సవం'' జరుపుతారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహిస్తారు. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి వివరిస్తారు.




**జూన్ 18**

జూన్ 18వ తేదీన ఆదివారంనాడు "తెలంగాణ మంచి నీళ్ల పండుగ" నిర్వహిస్తారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఎదుర్కొన్న తాగునీటి ఎద్దడి నుంచి నేడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాలు బిగించి ఉచితంగా స్వచ్ఛమైన సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్న తీరును వివరించే కార్యక్రమాలు ఉంటాయి.

**జూన్ 19**

జూన్ 19వ తేదీ సోమవారం "తెలంగాణ హరితోత్సవం" ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడానికి పెద్ద ఎత్తున జరిగిన కృషిని, తద్వారా అడవులు పెరిగిన తీరును వివరిస్తారు.

**జూన్ 20**

జూన్ 20వ తేదీ – మంగళవారం "తెలంగాణ విద్యాదినోత్సవం" నిర్వహిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిరకాల విద్యా సంస్థల్లో సభలు నిర్వహిస్తారు. విద్యారంగంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరిస్తారు. అదేరోజున ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మన ఊరు మన బడి పాఠశాలల ప్రారంభిస్తారు. అదే సందర్భంలో సిద్ధమైన 10 వేల గ్రంథాలయాలను, 1,600 డిజిటల్ క్లాస్ రూమ్స్ లను ప్రారంభిస్తారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తారు.

**జూన్ 21**

జూన్ 21వ తేదీ బుధవారం " తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం" నిర్వహిస్తారు. దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ఇతర మత ప్రార్ధనా మందిరాల్లో వివిధ కార్యక్రమాలు ఉంటాయి.

**జూన్ 22**

జూన్ 22వ తేదీ గురువారం "అమరుల సంస్మరణ" కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణవ్యాప్తంగా పల్లెపల్లెనా, పట్టణాలు, నగరాల్లో, విద్యాలయాల్లో అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటిస్తారు. అమరుల సంస్మరణ తీర్మానాలు చేస్తారు. ఈ సందర్భంగా అమరుల త్యాగాలను స్మరిస్తారు. హైదరాబాదులో అమరుల గౌరవార్ధం ట్యాంక్ బండ్ పై కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహిస్తారు. హైదరాబాద్ లో నూతనంగా నిర్మించిన అమరుల స్మారకాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఉదయం అమరవీరుల స్థూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటించి, సాయంత్రం హైదరాబాద్ లో నిర్వహించే సభలో పాల్గొంటారు.

## పీర్జాదిగూడలో మినీ ట్యాంక్ బండ్ ను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి మేయర్ వెంకట్ రెడ్డి



మేడిపల్లి, జూన్ 16 (ప్రజాపాలన ప్రతినిధి): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హెచ్ఎండిఏ సహకారంతో సుమారు రూ10 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసిన "మినీ ట్యాంక్ బండ్" ను రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పనా శాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అలవాల సరితా దేవేందర్ గౌడ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకర్శించాయి. ఈ కార్యక్రమంలో కమీషనర్ వంశీ కృష్ణ,కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ఆసిఫాబాద్ జిల్లా జూన్ 16 (ప్రజాపాలన, ప్రతినిది) : ఈ నెల 24న జిల్లాలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా "జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనం", జిల్లా పోలీస్ కార్యాలయం", టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం" ప్రారంభోత్సవంతో పాటు ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలు ఉన్న సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బహిరంగ సభ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ, సిఐ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేని మల్లేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టీ కాంగ్రెస్ లో ఫైర్..!

హైదరాబాద్, జూన్ 16, :కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహం ఏమో కానీ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో దూకుడు రోజురోజుకు పెరుగుతోంది. మాటల్లో పదును కూడా రోజురోజుకు పెరిగిపోతుంది. అధికార బీఆర్ఎస్ పార్టీని ఒకవైపు.. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఒక ఆట ఆడేసుకుంటున్నారు. ఆరోపణలు గుప్పిస్తున్నారు. విమర్శల వర్షం కురిపిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమదే విజయం అంటూ పూర్తి విశ్వాసంతో ప్రకటనలు చేస్తున్నారు. అయితే ఆ విశ్వాసం ప్రజల్లో పెల్లుబికుతున్న అభిమానం వల్ల వచ్చిందా లేక కర్ణాటక ఫలితాలు ఇక్కడ రిపీట్ అవుతాయన్న ఒక అభిప్రాయాన్ని అందరిలో కల్పించడం ద్వారా పార్టీ బలగాన్ని పెంచుకునే వ్యూహంలో భాగంగా వచ్చిందా అన్నది కాస్త తరచి చూడాల్సి ఉంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో చేతికిలబడిన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు నిన్న మొన్నటి వరకు కూడా రాష్ట్రంలో పార్టీ పొజిషన్ రెండా? మూడా? అన్న సందిగ్ధావస్థలోనే గడిపారు. అటువంటి పరిస్థితిలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా ఘన విజయం సాధించడం ఒక్కసారిగా పరిస్థితిని తారుమారు చేసింది.

కర్ణాటక ఫలితాలు వచ్చేవరకు తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీని ఢీ కొట్టేది భారతీయ జనతా పార్టీనేనని చాలామంది భావిస్తూ వచ్చారు. ఖమ్మం, నల్గొండ వంటి జిల్లాలలో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేని పరిస్థితిని బిజెపి నేతలు బాగానే మేనేజ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 119 నియోజకవర్గాలలో తాము కనీసం 80 సీట్లను గెలుచుకుంటామని జిల్లాల వారిగా లెక్కలేసారు కమలనాథులు. ఆ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయి ఇప్పుడు తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలలో టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో చురుకుగా కనిపిస్తున్నాయి. మొన్నటి వరకు పాదయాత్రలతో హోరెత్తిన తెలంగాణ బిజెపిలో ఇప్పుడు కాస్త స్తబ్దత నెలకొంది. ఈ స్తబ్దతను బద్దలు కొట్టడానికి ఖమ్మం జిల్లా కేంద్రంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సారధ్యంలో భారీ ర్యాలీకి తెలంగాణ నాయకత్వం ప్రణాళిక రచించింది. ఈ భారీ సభ ద్వారా రాష్ట్రంలో తమ ఉనికి మరోసారి గట్టిగా చాటే ప్రయత్నం చేసింది. అందుకోసం భారీ ఏర్పాట్లు చేసుకుంది. కానీ తెలంగాణ బిజెపి నేతలకు అశనిపాతంలా బిపోర్‌జాయ్ తుఫాన్ ఎదురయింది. పెను తుఫాను తాకిడికి తమ సొంత రాష్ట్రం గుజరాత్ తల్లడిల్లి పోతుంటే తాము ఇతర రాష్ట్రాలలో రాజకీయం చేయడం ఎందుకు




అనుకున్నారో ఏమో కానీ అమిత్ షా ఖమ్మం జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఆయన ఎప్పుడు వచ్చేది ఇప్పుడప్పుడే తేలే పరిస్థితి లేదు. అయితే వెంటనే కోలుకున్న కమలనాథలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటనపై దృష్టి సారించారు. జూన్ 25వ తేదీన నడ్డా సభకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఆయన నాగర్ కర్నూలు సభకు హాజరు కానున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ కాంగ్రెస్‌లో ద్విగుణీకృతమవుతున్న కొత్త ఉత్సాహం పార్టీలో పలువురి చేరికకు కారణమవుతోంది. నిర్మల్, సిరిసిల్ల వంటి జిల్లాలలో పలువురు కీలక నాయకులు ఇతర పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా ఉన్నవారు సైతం బీఆర్ఎస్ పార్టీని వీడడం చర్చనీయాంశం అవుతుంది. ఈ చేరికలు ఇలా కొనసాగుతుండగానే తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒకవైపు బిజెపపైనా, ఇంకొక వైపు బీఆర్ఎస్ పార్టీపైనా విరుచుకుపడుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర కొనసాగిస్తూ.. సమయం దొరికినప్పుడల్లా అధికార పార్టీ వైఫల్యాలను ఎండ కడుతున్నారు. అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు పదేపదే చెబుతున్నారు. ధరణి పోర్టల్ కారణంగా అధికార పార్టీ నాయకులు మాత్రమే లాభపడ్డారని జెన్యూన్‌గా భూములను కలిగి ఉన్న చాలా మంది ఇబ్బందులకు గురయ్యారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. సభలు, సమావేశాలే కాకుండా కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలోనూ చెలరేగిపోతున్నారు. తాజాగా రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం సంధించారు. ఈ ధోరణిని కొనసాగిస్తూనే పార్టీ ఒకింత వీక్‌గా కనిపిస్తున్న నియోజకవర్గాలలో ఇతర పార్టీ నాయకులకు గాలమేసే కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేశారు ఇటీవల నిర్మల్ జిల్లాలో కీలకమైన నేత మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ గూటిని వీడి బిజెపిలో చేరిన నేపథ్యంలో అక్కడ ఎంతో కొంత బలమైన నేతగా పేరున్న బీఆర్ఎస్ నాయకుడు, సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడు అని భావించే శ్రీహరి రావును కాంగ్రెస్ పార్టీలోకి రప్పించుకున్నారు రేవంత్ రెడ్డి. ధరణి పోర్టల్, రీజినల్ రింగ్ రోడ్ అలైన్మెంట్‌లో అవకతవకలు, ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ఫీజు వసూలు లీజు తదితర అంశాలను టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రతిరోజు ప్రస్తావిస్తున్నారుఒకవైపు ప్రభుత్వం మీద ఆరోపణలు.. ఇంకొక వైపు చేరికలే కాకుండా తెలంగాణ ప్రజలకు ఒక నిర్దిష్టమైన సంకేతాలను ఇవ్వడానికి పార్టీ అగ్ర నేతలను తెలంగాణకు రప్పించే ప్రయత్నాలను సైతం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారు. సీఎల్పీ నాయకుడు పాదయాత్ర కొనసాగిస్తున్న నేపథ్యంలో దాని ముగింపు సభకు ప్రియాంక గాంధీనిగాని, రాహుల్ గాంధీనిగాని పిలిచే సన్నాహాల్లో ఉన్నారు. అన్ని కుదిరితే జూన్ 21 లేదా 23వ తేదీలలో అగ్ర నేతల్లో ఒకరు ఖమ్మం వేదికగా జరిగే సభకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇక తమ విజయ ప్రస్తానాన్ని ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించాలనుకుంటున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అక్కడ బలమైన నేతగా పేరు ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు దాదాపు డిసైడ్ అయ్యారు. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీవైపే మొగ్గు చూపుతున్నారన్న ఇండికేషన్స్ వచ్చాయి. కానీ జూన్ 14వ తేదీన పొంగులేటి తాను ఏ పార్టీలో చేరబోతున్నది చెప్పేస్తానని గతంలో చెప్పినప్పటికీ ఆయన ఎందుకో వెనుకంజవేయడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. తెలంగాణలో జూన్ 14న ఆదాయపు పన్ను శాఖాధికారుల తనిఖీలు కలకలం రేపాయి. ముగ్గురు బీఆర్ఎస్ పార్టీ నేతల ఇళ్ళు, ఆఫీసులే లక్ష్యంగా ఐటి సోదాలు కొనసాగాయి. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిల వ్యాపార లావాదేవీలను, ఆదాయ వ్యయాలను, ఐటి రిటర్న్‌ని పరిశీలించారు ఐటి అధికారులు. ఇదంతా ఐటి సిబ్బంది రొటీన్ వర్క్‌లో భాగమే అయినా వీటి వెనుక కేంద్రంలోని బీజేపీ పెద్దల ప్రమేయం వుందన్న ఆరోపణలు వినిపించాయి. ఇదే క్రమంలో కాంట్రాక్టర్‌గా పేరున్న మాజీ ఎంపీ పొంగులేటిపైనా బీజేపీ నేతలు నజర్ పెట్టారన్న వార్తల నేపథ్యంలోనే ఆయన ఏ పార్టీలో చేరాలనే విషయంపై నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారని తెలుస్తోంది. మొత్తం మీద తెలంగాణలో నెంబర్ టు తామేనని నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నాయకులు యమా ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తున్న ఈ ధీమాను కరిగించే దిశగా బీఆర్ఎస్, బిజెపి ఎలాంటి ఎత్తుగడలు వేస్తాయో వేచి చూడాలి.

## ఏం జరుగుతోంది..

### రెండు పార్టీల మధ్య ఒప్పందం

హైదరాబాద్, జూన్ 16, :బీజేపీ, బీఆర్ఎస్ లు ఒకే గూటి పక్షులు అన్న విమర్శ తెలంగాణ ఆవిర్భావం నుంచీ వినిపిస్తూనే ఉంది. రాష్ట్రం ఏర్పడిన తరువాత వరుసగా రెండు ఎన్నికలలో కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ విజయం సాధించేంత వరకూ కూడా ఇరు పార్టీల మధ్యా చక్కటి స్నేహ సంబంధాలు వెల్లివిరిశాయి. అయితే ఆ తరువాతే కారణాలేమైనా బీజేపీ, బీఆర్ఎస్ ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందా అన్నట్లుగా విభేదాలు తలెత్తాయి.బీజేపీ ముక్త భారత్ నినాదాన్ని అందుకున్న కేసీఆర్ బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల ఐక్యతకు తన శక్తికి మించిన ప్రయత్నం చేశారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి, కేంద్ర ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు.మోడీ ప్రభుత్వం మహా డేంజర్ అంటూ కాలికి బలపం కట్టుకుని మరీ ఒక్కో రాష్ట్రంలో పర్యటించి ప్రచారం చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రిగా దాదాపు ఏడేళ్ల పాటు కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకున్న ప్రతి నిర్ణయానికి తలూపి హఠాత్తుగా ప్లేటు ఫిరాయించారు. దేశానికి గుజరాత్ మోడల్ కాదు తెలంగాణ మోడల్ కావాలంటూ.. జాతీయ రాజకీయాలలోకి అర్జంటుగా దూకేశారు. తన ఐక్యతా యత్నాలకు స్పందన కరవు కావడంతో తానే సొంతంగా జాతీయ పార్టీని ప్రారంభించేశారు. అందుకోసం తనకు ఇన్నేళ్లుగా అధికారాన్ని ఇచ్చిన తెలంగాణ సెంటిమెంటుకు గండి కొట్టేశారు. తెలంగాణ అన్న పదాన్ని పార్టీ పేరులోంచి తీసేసి భారత రాష్ట్ర సమితిగా టీఆర్ఎస్ ను మార్చేశారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేయడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులకు ఏ నెలకు ఆ నెల జీతాలు ఇవ్వలేని, ‘తెలంగాణ మోడల్’ దేశానికి ఏం చేస్తుందంటూ బీజేపీ కూడా విమర్శలు ఎక్కుపెట్టింది. అదే సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత, ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఆరోపణలు ఎదుర్కొనడమే కాకుండా ఈడీ, సీబీఐ విచారణకు కూడా హాజరయ్యారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని.. ఎనిమిదేళ్లలో సీఎం కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారంటూ కేసీఆర్ పై బీజేపీ రాష్ట్రనాయకత్వం, కేంద్ర నాయకత్వమే కాదు.. కేంద్ర మంత్రులు కూడా విమర్శల దాడి చేశారు. అయితే ఇదంతా గతం ఇటీవల కొంత కాలంగా కేసీఆర్ బీజేపీ మాటెత్తడం లేదు. బీజేపీ కూడా కేసీఆర్ పై విమర్శల తీవ్రతను ఒకింత తగ్గించింది. కర్నాటక ఎన్నికల ఫలితమే.. ఈ ప్లేట్ ఫిరాయింపునకు కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో బలం ఉన్న కాంగ్రెస్ ను బలహీనం చేయడమనే వ్యూహంలో భాగంగా ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. మోడీ కాంగ్రెస్ ముక్తభారత్ లక్ష్యం కోసం కేసీఆర్ తెలంగాణలో బీజేపీకి హైప్ ఇచ్చి బలోపేతం చేశారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితం తరువాత కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో కాంగ్రెస్ ను ఇగ్నోర్ చేయడం ద్వారా బలహీనపరుద్దామన్న తమ వ్యూహం బెడిసి కొట్టిందని తెలుసుకున్నారు. దీంతో రెండు పార్టీలకూ ఇప్పుడు కాంగ్రెస్సే ప్రధాన వైరిపక్షమైపోయింది. దీంతో ఇప్పటి వరకూ పరస్పర విమర్శలు ఆరోపణలతో రక్తికట్టించిన డ్రామాకు తెరతీసి ప్రధాన శత్రువుపై జమిలిగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. మొత్తం మీద తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీల ఉమ్మడి వ్యూహం బెడిసికొట్టిందని పరిశీలకులు భావిస్తున్నారు

## ధరణి పోర్టల్ వింతలు...

### ఎమ్మార్వో ఫోర్జరీ సంతకం

Integrated Land Records Management System
DHARANI

వరంగల్, జూన్ 16, :ధరణితో భూ సమస్యల పరిష్కారం మాటేమిటోగానీ, కొత్త పంచాయితీలు పుట్టుకొస్తున్నాయి. ఇన్నాళ్లు రైతులకే చుక్కలు చూపించిన ధరణి.. ఇప్పుడు తహాశీల్దార్లనూ ఓ రేంజ్‌లో వణికిస్తున్నది. ధరణిలో ఏ టు జడ్‌కలెక్టర్లదే బాధ్యత అని ప్రభుత్వం ఢంకా బజాయించి చెబుతున్నా.. కలెక్టర్లు జారీ చేస్తున్న పట్టా పాసుపుస్తకాలపై మాత్రం తహాశీల్దార్ల సంతకాలు ఉంటున్నాయి. ఎవరైతే ఫైల్‌అప్రూవ్‌చేస్తారో వారి సంతకమే ఉండాల్సి ఉండగా.. ధరణిలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతున్నది.అప్రూవల్ కలెక్టర్ ఇస్తున్నా.. సంతకం మాత్రం తహాశీల్దార్లది ఉంటున్నది. రేపేమైనా కోర్టు చిక్కులు వస్తే.. ఏ పాపం ఎరగని తహాశీల్దార్లు కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది. అసలు అన్ని పనులు కలెక్టర్లు చేయాలన్న ఆలోచనే అసంబద్ధమైనదని రెవెన్యూ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఏదిఏమైనా రెండున్నరేండ్లుగా లక్షలాది పట్టాదార్‌పాస్‌పుస్తకాలపై కలెక్టర్లు యథేచ్ఛగా తహాశీల్దార్ల డిజిటల్ సంతకాలు పెడుతుండటం రెవెన్యూ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. తహాశీల్దార్ల డిజిటల్ సంతకాలతో పాస్ పుస్తకాలకు అప్రూవల్స్ ఇస్తున్నారు. అదీ ఒకటీ, అరా అనుకుంటే పొరపాటే.. ధరణి మాడ్యూళ్లు ఇచ్చిన విశేషాధికారాలతో కలెక్టర్లు.. లక్షలాది పట్టదారు పాస్ పుస్తకాల్లో తాసిల్దార్ల సంతకాలు పెట్టేశారు. రెండున్నరేండ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా.. సీసీఎల్ఏ అధికారులు గానీ, సర్కారు గానీ ఈ విషయాన్ని గుర్తించకపోవడం గమనార్హం. ఇది ముమ్మాటికీ ఫోర్జరీనే అని రెవెన్యూ ఉద్యోగులు, అధికారులంతా గుర్తించినప్పటికీ బయటకి చెప్పలేకపోతున్నారు. కలెక్టర్ల ఆమోదించే ఫైళ్లపైన ఆయన సంతకానికి బదులుగా తహాశీల్దార్ల సంతకాలే ఎందుకు పెట్టాలి కలెక్టర్ సంతకం ఎందుకు పెట్టడం లేదు ధరణి మాడ్యూళ్ల ప్రకారం రిపోర్టులు మాత్రమే తయారు చేయాలి. వారి నివేదికల ఆధారంగా కలెక్టర్ ఆమోదించొచ్చు.. తిరస్కరించొచ్చు. అలాగే ఏదైనా సమస్య పరిష్కారంలో తహశీల్దార్ నెగిటివ్ ఫీడ్ బ్యాక్ ఇచ్చినా కలెక్టర్ ఆమోదించే అవకాశం ఉన్నది. అలాంటి సందర్భాల్లోనూ తహశీల్దార్ల సంతకాలతో కలెక్టర్లు ఆమోదిస్తుంటే ఫోర్జరీ అనకపోతే ఏం అంటారని రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు.తమకు తెలియకుండానే కలెక్టరేట్లలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది తహశీల్దార్ల డిజిటల్ సంతకాలతో పట్టాదారు పాసు పుస్తకాలు.. ఇతర ఫైళ్లను క్లియర్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది సరైంది కాదని కలెక్టర్లకూ తెలుసు. కానీ, తన సంతకానికి బదులుగా మండల స్థాయి అధికారి సంతకంతో ఫైళ్ల క్లియరెన్స్ చేస్తున్నామని గుర్తించినా ప్రభుత్వానికి మాత్రం నివేదించడానికి జంకుతున్నారు. ధరణి పోర్టల్ లో ఆప్షన్ల మార్పుతో ఈ ఫోర్జరీ బాగోతానికి తెర పడుతుంది. కానీ, రానున్న రోజుల్లో ఏవైనా కేసులు ఎదుర్కోవాల్సి వస్తే తప్పు చేయని తహాశీల్దార్లే బాధ్యులవుతారని రెవెన్యూ శాఖలో పెద్ద చర్చనే నడుస్తున్నది. భూ సంబంధ సమస్యలన్నీ కలెక్టర్లు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీఆర్వో స్థాయి నుంచి కలెక్టర్ వరకు చేసే పనులన్నీ వారే నిర్వర్తించాల్సి వస్తున్నది. అప్పుడేమో ఇది కష్టమని, అసాధ్యమని ఏ కలెక్టర్ చెప్పే సాహసం చేయలేదు. ఇప్పుడేమో తహశీల్దార్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా చేసుకుని బయోమెట్రిక్‌తో వారి డిజిటల్‌సంతకాలనే పెట్టేస్తున్నారు. తెలంగాణ భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం 2020 ప్రకారం పట్టాదారు పాసు పుస్తకాల జారీ తహశీల్దార్లకే ఉంది.తహశీల్దార్లు తిరస్కరించిన ఫైళ్లను కూడా కలెక్టర్‌అప్రూవల్‌చేస్తే సమస్య ఎవరికి ఎవరు బాధ్యులు తహశీల్దార్లు చేయొద్దన్న పనులు కూడా కలెక్టర్లు పూర్తి చేస్తే ఇక్కట్లే కదా! నిజానికి అన్ని పనులు కలెక్టర్లతోనే చేయించాలన్న ఆలోచనే అసంబద్ధమని రెవెన్యూ వర్గాలు విమర్శిస్తున్నాయి. నిజానికి తహశీల్దార్లు పంపిన నివేదికను ఆమోదించి పని పూర్తి చేసే బాధ్యతను డివిజన్ స్థాయి వాళ్లకు అప్పగించొచ్చు. కానీ అధికారమంతా కలెక్టర్ల చేతిలోనే ఉంచుకోవాలనుకోవడంలోనే కుట్ర దాగి ఉన్నదన్న అనుమానాలు కలుగుతున్నాయి. కొందరు పెద్దల భూములను క్లియర్ చేయించుకునేందుకు కలెక్టర్ స్థాయిలోనైతే పనులు చకచకా అవుతాయి. అందుకే వాళ్ల సంతకాలతో కలెక్టర్లు పూర్తి చేస్తున్నారేమోనని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ధరణి పోర్టల్‌ద్వారా స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు కలెక్టర్ బయోమెట్రిక్‌తో పరిష్కరిస్తే తహశీల్దార్ల సంతకాలే వస్తున్నాయి. ఎవరు ఫైనల్‌చేస్తే వారి సంతకంతో కూడిన పత్రాలు, పాసు పుస్తకాలు రావడం కరెక్ట్. కానీ తెలంగాణలో మాత్రం కింది స్థాయి అధికారి డిజిటల్‌సంతకం వచ్చేటట్లుగా ధరణి పోర్టల్‌ను రూపొందించారు. దీనినే బ్యూటీ ఆఫ్‌ధరణి పోర్టల్‌అని తహశీల్దార్లు ఎద్దేవా చేస్తున్నారు. తహశీల్దార్లకుబయోమెట్రిక్, డిజిటల్‌కీ ఇవ్వకపోయినా వారి సంతకం వచ్చేలా చేయడం ధరణి పోర్టల్‌లోని అతి పెద్ద పొరపాటుగా చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఇంకేమైనా చేయడానికి ఆస్కారం లేదని ఉన్నతాధికారులేమైనా గ్యారంటీ ఇస్తారా అని వారు ప్రశ్నిస్తున్నారు. పెండింగ్ మ్యుటేషన్ విషయంలో ఓ తహశీల్దార్‌చెక్‌లిస్టులో “నాట్ రికమండెడ్ యస్ ద సెల్లర్ ఈజ్ నాట్ ద పట్టాదార్” రిమార్కుతో పంపారు. కానీ అది అప్రూవ్ అయ్యింది. ఇదే విషయమై కలెక్టరేట్‌లోని ధరణి కోఆర్డినేటర్‌ను ప్రశ్నిస్తే ఓవర్‌లుక్ అయ్యిందని సమాధానమిచ్చినట్లు తెలిసింది. అప్రూవల్ పొందిన వ్యక్తి స్లాట్ బుక్ చేసుకుని వచ్చి రిజిస్ట్రేషన్ చేయమన్నాడు. ఇప్పుడు గుర్తించకుండానే రిజిస్ట్రేషన్ చేసేస్తే చేతులు మారే ప్రమాదం ఉన్నది. ఇలాగే కొన్ని జిల్లాల్లో తహశీల్దార్లు రికమండ్ చేసినా కలెక్టర్లు పెండింగులో ఉంచుతున్నారని తెలిసింది.లేదంటే కొన్ని సర్వే నంబర్లు అప్రూవ్‌చేయడం, మరికొన్నింటిని పెండింగు పెట్టడమో చేస్తూ గందరగోళాన్ని సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీదైన భూములు, రియల్‌ఎస్టేట్ విస్తృతంగా సాగే ప్రాంతాల్లో తహశీల్దార్ల ఆమోదించిన ఫైళ్లు కూడా కలెక్టరేట్‌లో పెండింగులో ఉంచుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి ధరణి పోర్టల్‌ద్వారా అందిన దరఖాస్తులను పరిష్కరించేందుకు పూర్తి బాధ్యతను కలెక్టర్లదే. వీటి కోసం తహశీల్దార్లు రిపోర్టు ఇవ్వాలని ఎక్కడా లేదు. అయినా ఈ తతంగం కొనసాగుతూనే ఉన్నది.



# ఆది పురుష్: పర్వాలేదనిపించే మైథలాజికల్ డ్రామా !




పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన భారీ మైథలాజికల్ మూవీ ఆదిపురుష్. కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం !

కథ:

రాఘవ (ప్రభాస్) తన సతీమణి జానకి (కృతి సనన్) – శేషు (సన్నీ సింగ్)తో కలిసి వనవాసంలో ఉండగా రావణ (సైఫ్ అలీ ఖాన్) సాధువు వేషంలో వచ్చి జానకిని తీసుకు వెళ్తాడు. తన సోదరి శూర్పణఖ చెప్పిన మాటలకు తోడు సహజంగా తన స్వభావం కారణంగా రావణ జానకి పై ఆశ పెంచుకుంటాడు. అనంతరం రాఘవ తన సతీమణి జానకిని దక్కించుకోవడానికి ఏం చేశాడు?, ఈ మధ్యలో హనుమంతుడి శక్తి ఎలా సాగింది ?, అలాగే ఈ యుద్ధంలో వానర సైన్యం పోరాట పటిమ ఎలా సాగింది ? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్ :

రామాయణంలోని ప్రధాన ఘట్టాలను యుద్ధ నేపథ్యంలో పూర్తిగా 3డిలో తెరకెక్కించడమే ఈ సినిమా ప్రధాన ప్లస్ పాయింట్. పైగా అన్ని ముఖ్య పాత్రలకు అగ్ర నటీనటులు నటించడం.. ప్రభాస్ రాముడిగా, కృతి సనన్ సీతగా, రావణుడిగా సైఫ్ అలీ ఖాన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్.. ఇలా ప్రతి ఒక్కరూ తమ పాత్రల్లో చాలా బాగా నటించారు. పైగా అత్యంత భారీ అంచనాలతో పాన్ ఇండియా చిత్రంగా వచ్చిన ఈ సినిమాలో అద్భుతమైన విజువల్స్, భారీ నిర్మాణ విలువలు ఈ సినిమాకి ప్రధాన ప్లస్ పాయింట్లు. ఇన్నాళ్లు ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ప్రభాస్ ఫ్యాన్స్ కు ఓం రౌత్ ఈ సినిమా రూపంలో గుర్తుపెట్టుకునే మంచి విజువల్ ట్రీట్ ఇచ్చారు. సినిమా చూస్తున్నంత సేపూ ఓ అత్యుత్తమైన హాలీవుడ్ యాక్షన్ మూవీ చూస్తున్న ఫీల్ కలుగుతుంది. ప్రభాస్ తన పరిపక్వతమైన నటనతో ఈ చిత్రంలోనే ఉత్తమమైన నటనను కనబర్చారు. ముఖ్యంగా క్లిష్టమైన కొన్ని యుద్ధ సన్నివేశాల్లో ఆయన తన మార్క్ యాక్షన్ తో, నటనతో సినిమాకే హైలెట్ గా నిలిచారు. ఇక కథానాయికగా నటించిన కృతి సనన్ తన స్క్రీన్ ప్రెజెన్స్ తో పాటుగా తన నటనతోనూ బాగా ఆకట్టుకుంది. ముఖ్యంగా కొన్ని ప్రేమ సన్నివేశాల్లో అలాగే కొన్ని ఎమోషనల్ సీన్స్ లోనూ కృతి సనన్ పలికించిన హావభావాలు అలరించాయి. సైఫ్ అలీ ఖాన్ గెటప్ ఇబ్బంది పెట్టినా.. నటన బాగుంది. అలాగే సన్నీ సింగ్, సోనాల్ చౌహన్, దేవదత్ నాగ్ మరియు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగానే నటించారు.

మైనస్ పాయింట్స్ :

ఈ సినిమాకి ప్రధాన మైనస్ పాయింట్ అంటే కథనమే. ముఖ్యంగా ఈ సినిమా చూస్తున్నంత సేపూ తర్వాత ఏం జరుగుతుందో తెలిసిపోతూ ఉంటుంది. అలాగే సినిమాలో పాత్రల గెటప్ లు అండ్ సెటప్ కూడా తెలుగు ప్రేక్షకులకు కనెక్ట్ కావు. దర్శకుడు ఓం రౌత్ 3డి విజువల్స్ మీద పెట్టినంత కాన్సన్ట్రేషన్ కథాకథనాలు మీద పెట్టలేదనిపిస్తుంది. సినిమాలోని ఒక్కో సన్నివేశం విడిగా చూస్తే, ఆ సన్నివేశాలన్నీ పాత సినిమాల్లో చూసిన ఫీలింగే కలుగుతుంది. దీనికి తోడు సినిమా మొత్తం స్లోగా సాగుతూ ఉండటం వల్ల..ప్రేక్షకులు కొంత అసహనానికి గురి అవుతారు. ముఖ్యంగా సెకండ్ హాఫ్ లో కొన్ని సన్నివేశాలను అనవసరంగా లాగడం వల్ల ఆ సన్నివేశాల్లో ఇంట్రస్ట్ మిస్ అయింది. ఇంకా టైట్ స్క్రీన్ ప్లే మరియు ఎంగేజింగ్ ఎలిమెంట్స్ ఉండి ఉంటే ఈ సినిమా మరో స్థాయిలో ఉండేది.


సాంకేతిక విభాగం :

ఈ సినిమాకు సంబంధించి సాంకేతిక విభాగం గురించి మాట్లాడుకుంటే.. సినిమాటోగ్రఫీ వర్క్ అద్భుతంగా ఉంది. సినిమాలోని యాక్షన్ సన్నివేశాలతో పాటు మిగిలిన సన్నివేశాలను చాలా అందంగా చిత్రీకరించారు. ఎడిటింగ్ కూడా బాగుంది. సంగీత దర్శకులు అజయ్ – అతుల్ మరియు సంచిత్ బల్హారా, అంకిత్ బల్హారా సమకూర్చిన పాటలు, బ్యాక్గ్రౌండ్ స్కోర్ లు కూడా బాగున్నాయి. వాటి పిక్చరైజేషన్ కూడా చాలా బాగుంది. దర్శకుడు ఓం రౌత్ 3డిలో భారీ విజువల్స్ తో ఈ చిత్రాన్ని తెరకెక్కిం చినా.. మెయిన్ గా కథనంలో ఇంట్రెస్ట్ మిస్ అయింది. నిర్మాతల నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి.

తీర్పు :

రామాయణం లాంటి అత్యద్భుత దృశ్య కావ్యాన్ని.. 'ఆదిపురుష్' అంటూ 3డిలో వచ్చిన ఈ మైథలాజికల్ విజువల్ యాక్షన్ డ్రామా బాగానే ఆకట్టుకుంది. 3డి ఎఫెక్ట్స్, ప్రభాస్ – కృతి సనన్ ల నటన, భారీ యాక్షన్ ఎపిసోడ్స్ చాలా బాగున్నాయి. అయితే, తెలిసిన కథ కావడం, పైగా సెకెండ్ హాఫ్ పూర్తి స్థాయిలో ఇంట్రెస్ట్ గా సాగకపోవడం వంటి అంశాలు సినిమాని బలహీనపరుస్తాయి. అయితే ప్రభాస్ తన స్టార్ డమ్ తో ఈ సినిమాని మరో లెవెల్ కి తీసుకు వెళ్లారు. ఓవరాల్ గా ఈ చిత్రం ప్రభాస్ ఫాన్స్ ను, చిన్న పిల్ల లను చాలా బాగా ఆకట్టుకుంటుంది.

## రామ్ చరణ్ "గేమ్ చేంజర్" నుండి అంజలి లుక్ రిలీజ్!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పొలిటికల్ యాక్షన్ ఎంటర్టైనర్ గేమ్ చేంజర్. రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం లో కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. మేకర్స్ తాజాగా ఈ చిత్రం నుండి అంజలి లుక్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ చిత్రం లో అంజలి కీలక పాత్రలో నటిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే.నేడు నటి పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## క్యాస్టింగ్ తోనే ఎగ్జైట్మెంట్ పెంచుతున్న పవన్ "ఓజి".!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్ గా యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రం "ఓజి". ఇక ఈ సినిమా అనౌన్సమెంట్ తోనే ఎనలేని హైప్ తెచ్చుకోగా మరి ఈ సినిమా నుంచో నటుణ్ని రివీల్ చేస్తుండడంతో పవన్ ఫ్యాన్స్ సహా ఇతర హీరోల అభిమానులకి కూడా ఆశ్చర్యంగా మారుతుంది.దీనితో ఇప్పుడు ఓజి అయితే పవన్ లైనప్ లోనే మోస్ట్ వాంటెడ్ సినిమాగా అయితే మారుతుంది. మరి పాన్ ఇండియా ఆడియెన్స్ రాబట్టాలి అంటే ఈ రేంజ్ క్యాస్టింగ్ అయితే ఉండాలి. దీనితో జస్ట్ క్యాస్టింగ్ తోనే ఓజి పై మరింత హైప్ ఇప్పుడు సెట్ అయ్యింది. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

## సలార్ - రాఖీ భాయ్ ఒప్పందం లీక్




యంగ్ రెబెల్ స్టార్ ప్రభాస్ ఈ మధ్య కాలంలో వరుస పెట్టి సినిమాల మీద సినిమాలు చేస్తూ దూసుకుపోతోన్నాడు. ఇప్పటికే కొన్ని పాన్ ఇండియా చిత్రాలతో ప్రేక్షకులను అభిమానులను అలరించిన అతడు.. తాజాగా 'ఆదిపురుష్' అనే చిత్రంతో వచ్చాడు. దీనికి అన్ని ఏరియాల్లో విశేషమైన స్పందన లభిస్తోంది. ఫలితంగా ఇది భారీ ఓపెనింగ్స్ సాధించే దిశగా సాగుతోంది.'ఆదిపురుష్' మూవీ రిలీజ్ కావడంతో ఇక ప్రభాస్ ఫోకస్ మొత్తం 'సలార్' మీదనే పెట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన షూటింగ్ కూడా దాదాపుగా పూర్తైనట్లు ప్రచారం జరుగుతోంది. మిగిలిన పనులను కూడా వీలైనంత త్వరగా కంప్లీట్ చేసుకుని ఈ చిత్రాన్ని ముందుగా ప్రకటించిన సెప్టెంబర్ 28వ తేదీనే రిలీజ్ చేయాలని భావిస్తున్నారు.ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'సలార్' మూవీ గురించి ఎన్నో రకాల వార్తలు వైరల్ అవుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఈ చిత్రం రెండు భాగాలుగా వస్తుందని ఇందులో కేజీఎఫ్ స్టార్ రాఖీ భాయ్ కూడా నటిస్తున్నాడని అంటున్నారు. కానీ యూనిట్ నుంచి మాత్రం ఎలాంటి స్పష్టతా రాలేదు. ఈ పరిస్థితుల్లో తాజాగా ఈ చిత్రం గురించి మరో క్రేజీ న్యూస్ వైరల్గా మారింది.ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం అవుతోన్న సమాచారం ప్రకారం.. 'సలార్' మూవీకి 'కేజీఎఫ్'కు ఓ లింక్ ఉందట. చాప్టర్ 2లో రాఖీ భాయ్ చనిపోయే ముందు తన స్నేహితుడైన సలార్తో మాఫియాను మట్టుబెట్టమని చెబుతాడట. ఈ మేరకు అతడు సలార్ నుంచి మాటను కూడా తీసుకుంటాడట. స్నేహితుడికి ఇచ్చిన మాట ప్రకారమే ఇతడు కూడా విలన్స్ను ఏరిపారేస్తాడని టాక్.సలార్ను రాఖీ భాయ్ కలిసిన సన్నివేశాలను 'సలార్' మూవీలో చూపిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ చిత్రంపై ఉన్న అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి. ఇక ఈ మూవీలో ప్రభాస్ సరసన శృతి హాసన్ నటిస్తోంది. దీనికి రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తున్నాడు. దీన్ని హొంబళే ఫిల్మ్స్ బ్యానర్పై నిర్మిస్తున్నారు. ఇందులో జగపతి బాబు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్లుగా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## సూర్య "కంగువ" ఫస్ట్ లుక్ ఫిక్స్?




ప్రస్తుతం కోలీవుడ్ సినిమా దగ్గర భారీ అంచనాలు ఉన్న లేటెస్ట్ చిత్రాల్లో స్టార్ హీరో సూర్య నటిస్తున్న భారీ బడ్జెట్ పీరియాడిక్ చిత్రం "కంగువ" కూడా ఒకటి. మరి దర్శకుడు శివ తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా సినిమాపై తమిళ నాట సెన్సేషనల్ హైప్ నెలకొనగా ఈ సినిమాపై ఇప్పుడు ఇంట్రెస్టింగ్ బజ్ అయితే తెలుస్తుంది.మరి మేకర్స్ సినిమా అనౌన్సమెంట్ నాటి నుంచే అదిరే హైప్ ని తెచ్చుకోగా ఇక ఇపుడు సినిమా ఫస్ట్ గ్లింప్స్ సహా సూర్య ఫస్ట్ లుక్ ని కూడా రిలీజ్ చేయడానికి ఫిక్స్ అయ్యినట్టుగా తెలుస్తుంది. ఇక ఈ జూలై లో అయితే సూర్య బర్త్ డే కానుకగా ఈ సినిమాలో సూర్య ఫస్ట్ లుక్ సహా సినిమా తాలూకా ఫస్ట్ గ్లింప్స్ ని కూడా మేకర్స్ రిలీజ్ చేయనున్నట్టుగా ఇపుడు రూమర్స్ వినిపిస్తున్నాయి. దీనితో అయితే ఈ జూలై లో మాత్రం ఫ్యాన్స్ కి భారీ ట్రీట్ రావచ్చని చెప్పాలి.



Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989